



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 160 | ది.26-9-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 160 | Date : 26-9-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |


# దేశ రక్షణలో బీఎస్ఎఫ్ దే అగ్రభాగం

## చెన్నై బీఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్ లో నూతన భవనాలను ప్రారంభించిన కేంద్ర మంత్రి

- నక్సలైట్లు, దేశ వ్యతిరేకశక్తుల పీచమణచడంతో కీలక పాత్ర
- జవాన్లకు మౌలిక సౌకర్యాలు కల్పన మోదీ ప్రభుత్వ సంకల్పం
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడి



**చెన్నై,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** దేశ రక్షణలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అగ్రభాగాన నిలుస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. నక్సలైట్లు, దేశ వ్యతిరేక శక్తుల పీచమణచడంలో బీఎస్ఎఫ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. బీఎస్ఎఫ్ సిబ్బంది రక్షణ కవచంలా నిలవడంవల్లే మల్కాన్‌గిరి ప్రాంతం శాంతి, అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందనన్నారు. ఈరోజు చెన్నైలోని బీఎస్ఎఫ్ సెక్టార్ హెడ్‌క్వార్టర్స్ లో నూతనంగా నిర్మించిన పరిపాలనా, నివాస సౌకర్యాల భవనాలను ప్రారంభించారు. రూ.11.07 కోట్లతో నిర్మించిన అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ను, రూ. 4.74 కోట్ల వ్యయంతో నిర్మించిన గెటిజెట్ ఆఫీసనర్స్ భవనాన్ని. రూ.9.86 కోట్ల వ్యయంతో నిర్మించిన సిబ్బంది బ్యారక్‌ను, రూ.5.30 కోట్ల వ్యయంతో నిర్మించిన సబార్డినేట్ అధికారుల భవనాన్ని ప్రారంభించారు. బీఎస్ఎఫ్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఎస్ఎఫ్ అదనపు డైరెక్టర్ జనరల్ , సెవాంగ్ నాంగ్యాల్, ప్రత్యేక డైరెక్టర్ జనరల్ ఇంజనీర్ వివేక్ నంద్ వివేక్, చీఫ్ ఇంజనీర్ (దక్షిణ ప్రాంతం), చెన్నై ఎ. శ్రీనివాస రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఫ్రంటియర్ హెడ్‌క్వార్టర్స్,(ఒడిశా) సి.హెచ్. సేతురామ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, సెక్టర్ హెడ్‌క్వార్టర్స్, ( చెన్నై) విజయ్ సిన్హా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ( చెన్నై) జి.ఎస్. రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జవాన్లను ఉద్దేశంచి కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాలు... ఈ రోజు చెన్నైలోని బిఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్ లో పరిపాలనా భవనం, అధికారులు నివాసాలు, కింది స్థాయి అధికారుల నివాసాలు, వీర జవాన్ల కోసం నిర్మించిన నూతన నివాస సముదాయాలను ప్రారంభించిడం సంతోషంగా ఉంది. 2014లో బీఎస్ఎఫ్ చెన్నై--మల్కాన్‌గిరి సెక్టర్ ఏర్పడినప్పటి నుంచి నక్సలైట్లు, దేశ వ్యతిరేక శక్తులకు వ్యతిరేకంగా మన రక్షణ వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగంగా పనిచేస్తోంది. ఈ సెక్టర్ సిబ్బంది చూపిస్తున్న ధైర్యం, అప్రమత్తత మరియు అంకితభావం బి ఎస్ ఎఫ్ నినాదమైన "జీవితాంతం కర్తవ్యం" అనే మాటలకు నిజమైన అర్థాన్ని చూపిస్తున్నాయి. ఈ రోజు మల్కాన్‌గిరి శాంతి, అభివృద్ధికి కొత్త యుగంలోకి అడుగుపెట్టింది. మౌలిక సదుపాయాల రంగంలో కూడా అక్కడ నిరంతర అభివృద్ధి జరుగుతోంది. ఇది మీలాంటి వీర జవాన్లు ఒక అభేద్యమైన రక్షణ గోడలా నిలబడి దేశాన్ని కాపాడటం వల్లే సాధ్యమైంది. దేశానికి రక్షణ కల్పించడంలో బీఎస్ఎఫ్ అగ్రభాగాన నిలిచింది. దేశ సరిహద్దులను రాత్రింబవళ్లు కాపాడేందుకు దీక్షి సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. దేశాన్ని కాపాడే మన జవాన్లు కూడా సురక్షితంగా ఉండేందుకు వారికి అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నదే మోదీ ప్రభుత్వ సంకల్పం. ఈరోజు ప్రారంభించిన ఈ ఆధునిక బ్యారక్ కేవలం ఒక భవనం మాత్రమే కాదు. ప్రతికూల పరిస్థితుల్లో, మైనస్ ఉష్ణోగ్రతల్లో, ఎన్నో సవాళ్ల మధ్య కూడా దేశ సరిహద్దులను కాపాడుతున్న వీర సిబ్బంది, జవాన్ల పట్ల మన గౌరవానికి ఇది ఒక ప్రతీక. ఈ కొత్త ప్రాంగణంలో జవాన్లకు విశ్రాంతి, పరిశుభ్రత, రోజువారీ అవసరాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించాం.

# ఫార్మా రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టండి

## అహ్మదాబాద్ లో ఫార్మా రంగంపై రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్

- క్లస్టర్ మోడల్ లో ఏపీలో పారిశ్రామిక అభివృద్ధి
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మా ప్రత్యేకత
- నక్కపల్లిలో అభివృద్ధి చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ లో పెట్టుబడులకు ఆహ్వానం





**అహ్మదాబాద్,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026 - ఏపీ ఈడీబీ ఆధ్వర్యంలో ఫార్మా రంగంపై అహ్మదాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ప్రజాప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ గురించి మంత్రి వివరించారు. మంత్రి మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఫార్మాస్యూటికల్ తయారీ, ఔషధ ఎగుమతులు, ఆర్ అండ్ డీ, మౌలిక వసతులు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు వంటి అన్ని అంశాలను సమన్వయం చేస్తూ భారత ఫార్మా రంగ అభివృద్ధికి ఏపీ ప్రధాన కేంద్రంగా ఎదుగుతోంది. 2030 నాటికి భారత ఫార్మా మార్కెట్ 130 బిలియన్ డాలర్ల దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఏపీ భారతదేశంలో 3వ అతిపెద్ద ఔషధ ఎగుమతిదారుగా ఉంది. ప్రపంచ ఫార్మసీ మార్కెట్ విలువ 60 బిలియన్ డాలర్లు కాగా.. ప్రపంచ సరఫరాలో భారతదేశ వాటా 20%గా ఉంది. 2030 నాటికి పేటెంట్ గడువు ముగియనున్న ఔషధాల విలువ 251 బిలియన్ డాలర్లుగా ఉంది. 11.05 బిలియన్ డాలర్ల విలువతో భారతదేశ టాప్-5 ఫార్మా రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నిలిచింది.

**నక్కపల్లిలో అభివృద్ధి చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ లో పెట్టుబడులకు ఆహ్వానం..** అనకాపల్లి, విశాఖపట్నం, శ్రీకాకుళం, నెల్లూరు, విజయనగరం ప్రాంతాల్లో 4 ఫార్మాస్యూటికల్ క్లస్టర్లను అభివృద్ధి చేయడం జరుగుతోంది. విశాఖపట్నం భారతదేశపు ప్రముఖ మెడికల్ టెక్నాలజీ పార్క్ ఏఎంటీజడ్ కు కేంద్రంగా ఉంది. 6 ఆపరేషనల్ పోర్టులు, 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ఉన్నాయి. నక్కపల్లి వద్ద 2,000 ఎకరాల బల్క్ డ్రగ్ పార్క్ మొదటి దశ పూర్తైంది. నక్కపల్లి ఫార్మా పార్క్‌కు విస్తారమైన భూమి, పోర్ట్ కనెక్టివిటీ, తక్కువ నిర్వహణ వ్యయాలు, బలమైన ఫార్మా ఎకోసిస్టమ్ ఉన్నాయి. వీటితో పాటు ప్రభుత్వ మద్దతు, పెట్టుబడి రాయితీలు ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. అన్ని అనుకూలతలు ఉన్న బల్క్ డ్రగ్ పార్క్ లో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలకు మంత్రి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సాగా లైఫ్ సైన్సెస్ లి.డైరెక్టర్, ఇండియన్ డ్రగ్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్(ఐడీఎంఏ) నేషనల్ ప్రెసిడెంట్ విరంచి షా, జైడస్ గ్రూప్ సీనియర్ లీడర్ డా.గణేష్ నాయక్, స్వర్ణిమ్ స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ రిషబ్ గయప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఆది రిషబ్ జైన్, క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ ఛైర్మన్ డా.రాజీవ్ ఆర్.మోదీ, ఎంక్యూర్ ఫార్మాస్యూటికల్స్ ప్రెసిడెంట్ డా.దీపక్ గోండాలియా, జైడస్ ఫార్మేజ్ సీనియర్ ప్రొఫెషనల్ కపిల్ రజనీకాంత్ ఆచార్య, స్వర్ణిమ్ స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ యూనివర్సిటీ డైరెక్టర్ జనరల్ డా.రాగిన్ షా, స్టాలియన్ లేబరేటరీస్ ప్రతినిధి హితేష్ ఆచార్య, నేహ లైఫ్ సైన్సెస్ ప్రతినిధి జతిన్ గాంధీ, సీఎస్ఐఆర్-సీఎస్ఎంసీఆర్ఐ సీనియర్ సైంటిస్ట్ లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు ధర భరోసా.. వినియోగదారుడికి ధరల ఊరట

- రైతుబజార్లలో కిలో సన్నబియ్యం రూ.50.. ఉల్లిపాయలు రూ.35
- ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలతో సమగ్ర కార్యాచరణ: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, వినియోగదారులకు నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుబజార్లు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను అందిస్తూ ప్రజలపై ధరల భారం తగ్గిస్తున్నామన్నారు. మరోవైపు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల సాగును ప్రోత్సహించి, రైతులకు కొనుగోలు భరోసా కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ధరల పర్యవేక్షణ, నిత్యావసరాల ధరల స్థిరీకరణ, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర, రబీ పంటల ప్రణాళికపై గురువారం రాత్రి మంత్రుల బృందం వర్చువల్ సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమావేశంలో పాల్గొన్నారు. చర్చించిన అంశాలు, రూపొందించిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఆయన ఆదేశాలు, సూచనల మేరకు రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేలా కార్యాచరణ చేపట్టామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సరుకులను అందించేందుకు రైతుబజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా కేఎన్ఎం, బీపీటీ వంటి సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.50కు విక్రయిస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలోని అన్ని రైతుబజార్ల ద్వారా ఉల్లిపాయలను కిలో రూ.35కు అందిస్తున్నామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నాణ్యమైన పామాయిల్, కందిపప్పును సబ్సిడీ ధరలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. చక్కీ గోధుమపిండిని కూడా కిలో రూ.27కు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలు, బియ్యం, చికెన్, వంటనూనెలు, కందిపప్పు, మినుములు, వేరుశనగ, ఉల్లిపాయలు, గుడ్లు, టమాటా, అరటి తదితర 14 ప్రధాన వస్తువుల ధరలను నిరంతరం పర్యవేక్షించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రాష్ట్ర వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ)లో ఆహార వస్తువులకు కేటాయించిన మొత్తం వెయిటేజీలో వీటి వాటా 57.37 శాతంగా ఉందన్నారు. అందువల్ల ఆయా వస్తువుల ఉత్పత్తి, సరఫరా, నిల్వలు, మార్కెట్ ధరలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం

- ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేకరణ ప్రక్రియ
- వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. మాది సంపూర్ణ రైతు ప్రభుత్వమని, రైతుకు న్యాయం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఆయన స్పష్టం చేశారు. సొంత వాహనాల్లో ధాన్యం తరలించే రైతులకు రవాణా ఛార్జీలను వెంటనే చెల్లింపులు చేస్తామన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యమని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి ధాన్యం సేకరణ అంచనాలు పెంచుతామన్నారు. శుక్రవారం విజయవాడ అంత్రాలక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణ రాష్ట్రస్థాయి సన్నద్ధత సమావేశంలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్ షాపులో పాల్గొన్న అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తొలుత అంచనా వేసినప్పటికీ, ప్రస్తుతం రాష్ట్రంలో సమృద్ధిగా మూడు రోజులపాటు వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. అందువల్ల ఉత్పత్తి అంచనాలను మరోసారి సమీక్షించి, అవసరమైతే సవరించనున్నట్లు చెప్పారు.

**24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సేకరణ సొమ్ము..** ధాన్యం సేకరణలో కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని మంత్రి తెలిపారు. గత ఖరీఫ్‌లో సుమారు రూ.12 వేల కోట్ల ధాన్యం సేకరణ సొమ్మును రైతులకు 24 గంటల్లోపే చెల్లించామని పేర్కొన్నారు. అదే విధంగా ఈసారి కూడా రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా సేకరణ సొమ్ము చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**సొంత వాహనాలతో ధాన్యం తరలించే రైతులకు వెంటనే రవాణా ఛార్జీలు..** రైతులు తమ సొంత వాహనాల్లో కల్లాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించినప్పుడు రవాణా ఛార్జీల చెల్లింపులో జాప్యం జరుగుతున్న సమస్యను ఈ ఖరీఫ్ నుంచి పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. సొంత వాహనాలను ఏర్పాటు చేసుకుని ధాన్యం తరలించే రైతులకు రవాణా ఛార్జీలు సకాలంలో, వీలైనంత త్వరగా వారి ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఖరీఫ్‌లో రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ కోసం దాదాపు 31 వేల వాహనాలను అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు.

**6.10 కోట్ల గన్నీ బ్యాగులు సిద్ధం..** ధాన్యం సేకరణకు ఈ సీజన్‌లో 6.10 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఎక్కడా గన్నీ బ్యాగుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని, నాణ్యమైన గన్నీ బ్యాగులు రైతులకు అందేలా చూస్తున్నామని చెప్పారు.


**మహారాజశ్రీ విజయవాడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

ఓ.ఎస్.నెంబర్ : 516/2023

బిట్వీన్ :

ఐసిఐసి బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ, రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్, విజయవాడ.

--------వాది

మరియు

రమేష్ బోడపాటి, తండ్రి రాజేశ్వరరావు, హిందూ నివాసం : డోర్ నెం.54-9-2269/1, వెంకటేశ్వర కాలనీ, మెయిన్ రోడ్డు, గుంటూరు -522001, ఆంధ్రప్రదేశ్

--------ప్రతివాది

పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాది దావా సమన్లు అందజేయు నిమిత్తం ది.28-10-2026వ తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యెడల వారి పరోక్షమందు సదరు పై దావా తీర్మానము కాబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది.

**(కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము)**

**వాయిదా తేది : 28-10-2026**

ఇట్లు

**కునుకు రాజశేఖర్**

వాది తరపు అడ్వకేట్

గాంధీనగర్,

విజయవాడ-520003


# హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు మరియు జరిమానా

**విజయవాడ లీగల్,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** ద.06.05.2018 తేదీన ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధి లోని అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే అండర్ బ్రిడ్జ్ పైన జరిగిన ఘటన. సదరు ఘటనపై Cr.no.243 /2018 U/S 302 ఐ.పి.సి. గా కేసు నమోదు చేసిన అజిత్ సింగ్ నగర్ పోలీస్లు.సదరు కేసులో నిందితుడి పై నేరం ఋజువైనందున శుక్రవారం తెల్లవారుజామున స్పెషల్ జడ్జి ఫర్ ఏసీబీ/ఎస్సీ ఎస్టీ కేసులు మరియు మూడవ ఆడిషనల్ జిల్లా & సేషన్స్ కోర్టు జడ్జి శ్రీమతి ఎల్. తేజ్యోవతి గారు నిండితుడైన మానేపల్లి వేణు కుమార్(39 సం)కు జీవిత ఖైదు మరియు రూ.2,000/- జరిమానా విధించడం జరిగింది. ముద్దాయి మరియు హతుడు ఇద్దరూ ఒక ఐదు నెలల నుంచి గాంధీనగర్ లో ఒక సెక్యూరిటీ ఆఫీస్ నందు సెక్యూరిటీ గార్డు గా పనిచేస్తున్నట్లు, ఈ క్రమంలో ఒకరి టవల్ ఒకరు వాడిన సమయంలో ముద్దాయి మచిలీపట్నం కు చెందిన వేణు కుమార్ (39 సం) హతుడైన నంద్యాలకు చెందిన బాలచంద్రుడుని ఇనుపరాడ్డుతో కొట్టా అతను మరణించాడు. దర్యాప్తులో బాగంగా నిందితుడిని ది.10.05.2018 తేదీన అరెస్ట్ చేసి న్యాయస్థానం నందు అప్పటి అజిత్ సింగ్ నగర్ ఇన్స్పెక్టర్ జగన్ మోహన్ రావు హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీమతి జి.అనిత , సి.యమ్.ఎస్. ఇనస్పెక్టర్ పి.జగదీశ్వరరావ, ప్రస్తుత అజిత్ సింగ్ నగర్ ఇన్స్పెక్టర్ శ్రీ చంద్ర శేఖర్, మరియు సి. ఎం. ఎస్. సిబ్బంది పర్యవేక్షణలో 17 మంది సాక్షులను విచారించడం జరిగింది.


**దస్తావేజు పోయినది**

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, రామరాజ్యనగర్, కబేళా రోడ్డు, రాము క్వారీ, డోరు నెం.3-1-110 కాపురస్తురాలు దేవరకొండ కాశీరావు గారి భార్య దేవరకొండ హనుమాయమ్మ అను నా పేరిట విజయవాడ జిల్లా రిజిస్ట్రారు కార్యాలయంలో 1వ పుస్తకం, నెం.2555/1999రుగా గల అర్బన్ ల్యాండ్ సీలింగ్ దస్తావేజుతోపాటు కొన్ని కాగితములు కలిగిన కవర్ 2024లో వచ్చిన బుడమేరు వరదలలో కొట్టుకుపోయినవి. పరిసర ప్రాంతాలలో ఎక్కడ వెదకిననూ ఒరిజినల్ దస్తావేజు కనపడలేదు. కావున ఎవరికైనా దస్తావేజు కనపడిన యెడల నాకు తెలియపరచినచో తగిన పారితోషికం అందజేయబడును. వాటిని ఎవ్వరైనా దుర్వినియోగపరచినచో చట్టప్రకారం చర్యలు తీసుకొందునని, సదరు దస్తావేజును ఎవరికినీ తాకట్టు పెట్టుటగానీ, అన్యాక్రాంతములు చేయుటగానీ జరిగి యుండలేదని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.

**సెల్ నెం.9290029950**


# ఓటుహక్కు పరిరక్షణకు రాష్ట్రవ్యాప్త ఉద్యమం : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

- ఎస్.ఐ.ఆర్. ను నిలిపివేసి అర్హులైన ప్రతి ఓటరు హక్కును కాపాడాలి
- సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమాలు



**కడప,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** ఓటుహక్కు పరిరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య తెలిపారు. SIR ప్రక్రియను నిలిపివేయాలని, ఈ ప్రక్రియలో తప్పుగా తొలగించిన అర్హులైన ఓటర్లందరి ఓటుహక్కును పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్క అర్హుడి పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి అన్యాయంగా తొలగించకూడదని, ప్రతి అర్హుడి ఓటుహక్కును నిర్ధారించాలని అన్నారు. ఎన్నికల సంఘం పనితీరుపై వెలుగులోకి వచ్చిన అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాలని ఈశ్వరయ్య కోరారు. ఓటర్ల జాబితాల నిర్వహణలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, ఓటర్ల డేటాబేస్ కేంద్రీకరణపై వచ్చిన అభ్యంతరాలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని అన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రతను కాపాడుతూ ఓటర్ల జాబితాల్లో పారదర్శకతను నిర్ధారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎస్.ఐ.ఆర్ పేరుతో అర్హులైన ఓటర్లు తమ ఓటుహక్కును కోల్పోయే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 28 భగత్‌సింగ్ జయంతి నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వామపక్ష పార్టీలు, పౌరసంఘాలు, ప్రజాస్వామ్య వేదికలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ, ఓటుహక్కు రక్షణ కోసం అన్ని ప్రజాస్వామ్య శక్తులు ఐక్యంగా కదలాలని, ఈ ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు విస్తరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య కోరారు.

## హెచ్ఎం కేఎస్ జగదీశ్వర్‌రావుకు ఘన సత్కారం



**గన్నవరం,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** మన సాహితీ సంగమం శ్రేయోభిలాషి, గొల్లనపల్లి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేఎస్ జగదీశ్వర్‌రావు ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గన్నవరంలోని ఆయన నివాసంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, గొల్లనపల్లి పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ దొండపాటి సాంబశివరావు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ, 37 సంవత్సరాల సుదీర్ఘ సేవానంతరం పదవీ విరమణ పొందుతున్న జగదీశ్వరరావు గొల్లనపల్లి పాఠశాలను ఒక విద్యావనంలా, జిల్లాలోనే ఒక నమూనా పాఠశాలగా తీర్చిదిద్దారని కొనియాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించేలా ప్రభుత్వం, విద్యాశాఖల తరఫున ఆయన విశేష కృషి చేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో వి.కె.ఆర్. కళాశాల విశ్రాంత ఉపన్యాసకులు మద్దకూరి విజయకుమార్, 1974-75 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధి ఉడతా రామకృష్ణ, గన్నవరం సారస్వత సమితి ప్రతినిధి కంచెల నాగరాజుతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని జగదీశ్వర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## అలుగు ఉధృతి.. ఆగిన రాకపోకలు.. అవస్థల్లో ప్రజలు



**తిరువూరు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** తిరువూరు మండలం మునకుళ్ల గ్రామ శివారులోని శివాలయం వద్ద రోడ్డుపై అలుగు ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఊటుకూరు-- తిరువూరు మధ్య శివారు గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, రాకపోకలు నిలిచిపోయాయి. అలుగు ప్రవాహం ప్రమాదకరంగా ప్రవహిస్తున్నప్పటికీ, తప్పనిసరి పరిస్థితుల్లో స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా చంటిబిడ్డలతో ఆస్పత్రికి వెళ్లాల్సిన తల్లులు ప్రవాహంలోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

## అంగన్వాడీ కేంద్రాల్లో ఉత్సవ కార్యక్రమాలు




**చందర్లపాడు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** మన అంగన్వాడీ మన బాధ్యత 9వ జాతీయ పోషణ మాసంలో భాగంగా నందిగామ ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ లక్ష్మీ భార్గవి ఆదేశాల మేరకు చందర్లపాడు లోని పలు అంగనవాడి కేంద్రాలలో సూపర్వైజర్ శ్రీలత ఆధ్వర్యంలో అంగనవాడి ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ లో పోషణ ఉత్సవంలో భాగంగా గర్భిణీలు, బాలింతల సంరక్షణ,శిశు సంరక్షణ, పోషక ఆహారం,ఆటల ద్వారా విద్య, పూర్వ ప్రాథమిక విద్య,టీకాలు, ఎత్తు బరువులు పరిశీలన, పరిశుభ్రత, సమాజ అభివృద్ధి,తల్లి శిశువు ఆరోగ్యం, మొదలైన అంశాల గురించి గర్భవతులకు బారింతలకు వివరించారు. అదేవిధంగా వైవిధ్యం చిరుధాన్యాలు ప్రోటీన్ పప్పులు కూరగాయలు ఆకుకూరలు సీజనల్ పండ్లు వాటి ప్రాధాన్యత వాటి వల్ల కలిగే ఉపయోగాలు గురించి వివరించడం జరిగింది . అంగన్వాడి కేంద్రాల్లో బాలింతలకు గర్భిణీ స్త్రీలకు సకాలంలో వారికి అందించాల్సినటువంటి కోడిగుడ్లు బాల సంజీవని మొదలైనటువంటి ఇస్తున్నారా లేవని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త లు నిర్మల, సునీత, పద్మ, దుర్గాభ సైదమ్మా,మరియు హెల్పర్స్ అంగన్వాడి సెంటర్లు పరిధిలోని తల్లులు గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు.

## స్త్రీశక్తికి అనుగుణంగా 4 వేల కొత్త బస్సులు ఇవ్వాలి



**పుట్టపర్తి,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** స్త్రీశక్తి పథకంతో పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రాష్ట్రంలో తక్షణమే 4 వేల కొత్త ఆర్టీసీ బస్సులు సమకూర్చాలని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పుట్టపర్తిలోని అబ్దుల్ కలాం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన శ్రీ సత్యసాయి జిల్లా ఇ.యు. జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్సులతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందిని పెంచాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీయే కొనుగోలు చేసి సిబ్బందితో నడపాలని డిమాండ్ చేశారు. యూనియన్ పట్ల ఆకర్షితులై ఇతర యూనియన్ ల కు చెందిన హిందూపురం, పుట్టపర్తి, కదిరి, మడకశిర డిపోలకు చెందిన మొత్తం 20 మంది ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సి. నబీరసూల్, కడప జోన్ జోనల్ కార్యదర్శి ఎన్. రాజశేఖర్, జోనల్ అధ్యక్షుడు పి.ఎస్. ఖాన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.బి. నాగార్జునరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జి.వై.పి.రావు, జిల్లా కార్యదర్శి కుంచపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. సుమారు 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

# ఆందోళన వద్దు కూటమి అండగా ఉంటుంది: ఎమ్మెల్యే పంతం నానాజీ

-ముంపుకు గురైన పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే





**కాకినాడ రూరల్,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** 'అర్నబ్' తుఫాను కారణంగా ముంపుకు గురై పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ రైతులకు భరోసా ఇచ్చారు. కరప మండలం వాకాడ, వేళంగి, కూరాడ, వేములవాడ గ్రామాల పరిధిలో ముంపుకు గురైన పంట పొలాలను, ఇరిగేషన్ కాలువలను అధికార యంత్రాంగంతో కలిసి ఎమ్మెల్యే పంతం నానాజీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంతం నానాజీ బాధిత రైతులతో నేరుగా మాట్లాడి ధైర్యం చెప్పారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. వరద నీరు సాఫీగా సాగిపోయేందుకు కాలువల వద్ద జేసీబీ యంత్రాలతో ముమ్మరంగా సాగుతున్న పనులను ఎమ్మెల్యే స్వయంగా పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే నీటి సంఘం అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు ఎప్పటికప్పుడు కాలువలు,పంట పొలాలను పర్యవేక్షిస్తూ రైతులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్, సొసైటీ అధ్యక్షులు దూడల నారాయుడు, సైనవరపు భవానీ శంకర్,బండారు మురళి,భోగిరెడ్డి కొండబాబు,ఆకుల శ్రీనివాస్,పంపన హరిబాబు,పైడికొండల ప్రసాద్, మీసాల రాంబాబు,యాళ్ల పండు,పెంకే సోమరాజు, కేమిరెడ్డి సురేష్,గరగ జమ్మి, సంద్రు వెంకన్న రావు, వెలుగు లచ్చ రావు,కంచి తేజ గణేష్,మేడిశెట్టి సత్యనారాయణ,గరగ ప్రసాద్,మీసాల ప్రకాష్,వెలుగుబంట్ల గంగాధర్, వెల్లుబంట్ల స్వామి, చోడిశెట్టి ప్రసాద్,వాసంశెట్టి నారాయణ, శ్రీ పాట్నీడి విష్ణు మూర్తి,అప్పనపల్లి వెంకట రమణ,పుణ్యమంతుల వెంకన్న,బత్తుల సతీష్, గంటా నాని బాబు, ఇమ్మానుయేల్,మారెళ్ల శివ,గంజ వర ప్రసాద్, బండారు మణికంఠ, గొల్లపల్లి సంజయ్, అంజి,సంబంధిత శాఖల అధికారులు, తహశీల్దారు ఆకుల సరస్వతి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఏవో ఇమ్మిడిశెట్టి సత్య, తదితరులు పాల్గొన్నారు.

# ముంపుకు గురైన వరి పొలాలను పరిశీలించిన మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మంగ గంగయ్య





**కాకినాడ రూరల్,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ లో తుఫాను ప్రభావంతో నీటి మునిగిన పంటను స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ, టిడిపి ఇన్చార్జి పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు రైతులకు భరోసా,మనోధైర్యం కల్పించేందుకు ముంపుకు గురైన పంటపొలాలను కాకినాడ రూరల్ వ్యవసాయ శాఖ మార్కెటింగ్ చైర్మన్ మంగ గంగయ్య చ పరిశీలించారు. కాకినాడ రూరల్ మండలం రేపూరు, చీడిగ, కొవ్వూరు, కొవ్వాడ,గంగనాపల్లి, తూరంగి ఆరు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకుని ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరు గ్రామాల రైతులు చీకట్ల వెంకటరమణ, మరుకుర్తి కృష్ణ, మరుకుర్తి శివ, పితాని ఆదినారాయణ, తలాటం మల్లేష్, స్వర్ణ రామారావు, ముద్రగడ అప్పారావు, ముమ్మిడి ఈశ్వరరావు, ముమ్మిడి బాబురావు, మాసుమేను శ్రీనివాసరావు, ముమ్మిడి సుభాష్. తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంత ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది "ఆర్ఎంపి వైద్యుడే"

-చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య...






**ఒంగోలు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** అనుభవ సంఘాల సమాఖ్య ఆంధ్ర ప్రదేశ్ ఆర్ఎంపీ పీఎంపీల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణంలోని బృందావన్ కళ్యాణ మండపంలో ఆర్ఎంపీ వైద్యుల రాష్ట్ర మహాసభ జరిగింది. ఫెడరేషన్ అధ్యక్షులు యామర్తి నాగేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. కార్యదర్శి కరెళ్ల గణపతి రావు సభా పరిచయం చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య సుదీర్ఘమైన ప్రసంగం చేశారు. పగలనకా, రాత్రనకా గ్రామీణ ప్రాంతాల్లో రుగ్మతకు గురైన ప్రజలకు ముందుగా గుర్తుకు వచ్చేది ఆర్ఎంపి వైద్యుడు అని అన్నారు. తాను కనిగిరిలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తే 15000 మంది ప్రజలు ఆ క్యాంపును వినియోగించుకున్నారని, అందుకు ప్రధాన కారణం క్వాలిఫైడ్ వైద్యులకు సహకారం అందించిన ఆర్ఎంపి వైద్యులని అన్నారు. తమ వృత్తి తో పాటు ప్రజాహిత కార్యక్రమాలు కూడా చేపట్టాలని పిలుపునిచ్చారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తన వాణిని వినిపిస్తానని సబి కుల హర్షధ్వానాల మధ్యన ప్రకటించారు. ఫెడరేషన్ గౌరవ సలహాదారు లంక దాసరి ప్రసాదరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల మనసులు చూరగొన్న ఆర్ఎంపీ వైద్యుడు కొన్ని విమర్శలకు గురవుతున్నాడని దానికి కారణం కూడా అతని వైద్యం అందించే తీరు అని అన్నారు. అధిక వైద్యానికి పాల్పడుతున్నారని అనగా జ్వరాలు వచ్చినప్పుడు డెంగ్యూ టెస్ట్ చేయించడం అదేవిధంగా హై యాంటీబయోటిక్స్ ఇంజక్షన్లు మందుల రూపంలో వాడమని సూచించడం తప్పన్నారు. తెలంగాణ గ్రామీణ వైద్యుల పై జరుగుతున్న దాడులను, అందుకు గల కారణాలను గ్రహించి ఎవరికీ హాని జరగకుండా ప్రాథమిక వైద్యం చేసుకోవాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్ఎంపి వైద్యులతో పాటు రాష్ట్రంలోని ఫెడరేషన్ నాయకులు విరివిగా పాల్గొన్నారు. 2200 మంది హాజరైన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు కోలా వెంకటేశ్వరరావు, కోశాధికారి సి ఎస్ కుమార్, కాటూరి వరప్రసాద్, కరేళ్ల ముక్తేశ్వర రావు, దాసు వెంకట నాగేశ్వరరావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, డివిఎస్ రాజు,గళ్ళా మురళి తదితరులు పాల్గొన్నారు.

## అధిక వర్షాలకు పత్తి పంట దెబ్బతినకుండా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలి

-మండల వ్యవసాయ అధికారి సూరిబాబు



**జి.కొండూరు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** అధిక వర్షాల వల్ల పత్తి పంట దెబ్బతినకుండా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి కె.సిహెచ్.సూరిబాబు సూచించారు.శుక్రవారం ఆయన ప్రత్తి పంటలను రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రత్తి సాగు రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.నీరు నిలిచి ఉన్న పల్లపు పొలాల్లో వెంటనే నీటిని తీసివేసుకునే ఏర్పాటు చేయాలని,మల్టీ-కే 13. 0. 45 ఎకరానికి ఒక కిలో బోరాన్ 200 గ్రాములు మరియు జింకు 250 గ్రాములు కలిపి పిచికారి చేయాలని తెలిపారు.తేమ అధికంగా ఉన్న పొలాల్లో నీటిని తీసివేసిన తర్వాత ఎకరానికి పొటాష్ 20 కేజీలు మరియు ఏదైనా కాంప్లెక్స్ ఎరువు 15 కేజీలు వేసుకోవాలని తెలియజేశారు.ఈ క్రాప్ లో ఇంకా నమోదు కానీ రైతులందరూ సెప్టెంబరు 30వ తారీఖు లోపు సంబంధిత రైతు సేవ కేంద్రంలో ఈ పంట మరియు ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

## మండల స్పెషల్ ఆఫిసర్ గా బాధ్యత లు తీసుకున్న సాయి ఈశ్వర్ రామ్.



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండల ప్రజాపరిషత్ కు స్పెషల్ ఆఫీసర్ గా బి ఎన్ వి సాయి ఈశ్వర్ రామ్ శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం పెనుగంచి ప్రోలు నందు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించడమైనది..

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

-కూచి వాగు వరదను పరిశీలించిన ఎస్ఐ అర్జున్



**పెనుగంచిప్రోలు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు నుండి అనిగండ్లపాడు వెళ్లే రహదారి పై ప్రవహిస్తున్న కూచి వాగు వదర ఉదృతిని పరిశీలిస్తున్న ఎస్ఐ అర్జున్, వర్షాల వల్ల వచ్చే వరదల పట్ల వాహన దారులకు ప్రయాణికులకు పలు సూచనలు చేసిన ఎస్ఐ .అర్జున్ .వరదల్లో వెళ్ళకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

## చికిత్స పొందుతున్న నాగరాజుకు యూనియన్ ఆర్థిక చేయూత



**విజయవాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** విజయవాడలోని ఎస్వీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాక్షి దినపత్రిక పాత్రికేయుడు నాగరాజును యూనియన్ నాయకులు ఆంధ్రప్రభ రామకృష్ణ, ఈనాడు జాన్, ఆంధ్రజ్యోతి సుబ్బారావు, సూర్య కిరణం సురేష్, వార్తా ప్రభ రాంబాబు, ఉదయం రామకృష్ణ సభ్యులు పరామర్శించారు. యూనియన్ తీర్మానం మేరకు అత్యవసర వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు. శ్రీ శోభనాచల ప్రెస్ క్లబ్ యూనియన్ నాగరాజు త్వరగా కోలుకోవాలని యూనియన్ నాయకులు ఆకాంక్షించారు. కష్ట కాలంలో విలేకరులకు అండగా ఉంటుందని యూనియన్ అధ్యక్షుడు నంజం రామకృష్ణ తెలిపారు.

## ఎమ్మెల్యే రాకతో కొండ పర్వ రహదారులకు మహర్దశ



**విస్సన్నపేట,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కొండ పర్వ గ్రామంలో తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పర్యటించారు. రహదారులు పారిశుధ్యం దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఆయన నడుంబిగించారు. స్వయంగా డ్రైనేజీ పూడిక తీయడం జరిగింది. డ్రైనేజీలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టొద్దని ఆయన సూచించారు. ఆర్ అండ్ బి ఏ ఈ గాయత్రీ దేవి మరియు కాంట్రాక్టర్ తో రోడ్డు నిర్మాణం గురించి మాట్లాడారు. నివాస ప్రాంతాలలో సిసి రోడ్డు మిగిలిన ప్రాంతాలలో బీటీ రోడ్డు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకునేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ చిన్నరాట్నాలు, మండల తాసిల్దార్ కే లక్ష్మి కళ్యాణి, ఎస్ ఐ అర్జున రాజు, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నేత జొన్నాదుల కోటేశ్వరరావు కన్నుమూత



**మంగళగిరి,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మంగళగిరి దామర్ల రమాకాంతరావు చేనేత కాలనీకి చెందిన జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు (జె కె) ఈరోజు మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడిన తొలినాళ్లలో పార్టీ కోసం చురుకుగా పనిచేసిన వాళ్లలో జె కె. ఒకరు. అప్పటినుండి ఇప్పటివరకు పార్టీని అంటిపెట్టుకున్న కోటేశ్వరరావు చేనేత వృత్తిని కొనసాగిస్తూ, అందరితో ఎంతో సరదాగా ఉండేవారు. కోటేశ్వరరావు మన నుండి దూరం కావటం చాలా బాధను కలిగిస్తుందని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని కోరుకుంటూ, కోటేశ్వరరావు మృతికి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు ఘన నివాళి అర్పించారు.

## పెడనలో మున్సిపల్ కమిషనర్ ఉద్యోగుల మధ్య కోల్డ్ వార్....

- చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు



**పెడన,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** పెడన పట్టణంలో మున్సిపల్ కమిషనర్ కొండయ్య ఉద్యోగుల మధ్య కోల్డ్ వార్ నడుస్తుంది.. కమిషనర్ తమను మానసిక వేదనకు గురి చేస్తున్నారని రెగ్యులర్ అపకోస్ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరు కమిషనర్ వ్యవహార శైలి పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. తమపై ఆయన భౌతిక దాడులకు కూడా దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధికార దుర్వినియోగం తోపాటు పలు అక్రమాలకు కూడా పాల్పడుతున్నారని వీరు పై అధికారులకు చేసిన ఫిర్యాదులు పేర్కొన్నారు. వికలాంగులు పట్ల కూడా ఆయన అమర్యాదగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కమిషనర్ పై శాఖ పరంగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డి డి సుబ్రహ్మణ్యం అదిలున్నీసా కె ఎస్ వి ఆర్ ఎస్ రామాంజనేయులు రాజారావు రాజేశ్వరరావు భవాని పుణ్యవతి అబ్దుల్ హక్కు తదితరులు ఫిర్యాదు చేశారు.

# సంపాదకీయం

## వైసీపీ శక్తి మంతం అవుతుందా.. ఘర్‌వాపసీపైనే ఆశలు ..!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో మళ్లీ శక్తిమంతం అవుతుందా లేదా అనేది ఆ పార్టీ అంతర్గత వ్యూహాలు, ప్రజాదరణ, 'ఘర్ వాపసీ' (పాత నాయకులను తిరిగి పార్టీలోకి తీసుకురావడం) వంటి చర్యలపైనే ఆధారపడి ఉన్నాయి. అయితే.. ఇప్పుడు కొత్త చర్చ ప్రారంభమైంది. ఘర్ వాపసీని ప్రధానంగా చేసుకుని రాజకీయాలు చేయాలని పైనుంచి క్షేత్రస్థాయి నాయకులకు ఆదేశాలు అందాయి. 2024 ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో నిరాశ పెరిగిన నేపథ్యంలో, పూర్వ వైభవాన్ని సాధించడానికి జగన్ వివిధ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో 'ఘర్ వాపసీ' అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. దీంతో 'ఘర్ వాపసీ'పై ఆశలు పెరుగుతున్నాయి. పాత కాపుల కలయికకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గతంలో వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా ఉండి, వివిధ కారణాల వల్ల పార్టీని వీడిన లేదా దూరంగా ఉన్న సీనియర్ నేతలను, అలాగే తటస్థంగా ఉన్న పాత నాయకులను తిరిగి పార్టీలోకి తీసుకురావడానికి వైసీపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. క్షేత్రస్థాయిలో బలమైన పట్టున్న పాత నేతలు తిరిగి వస్తే, నిరాశలో ఉన్న నియోజకవర్గ స్థాయి క్యాడర్‌లో సరికొత్త ఉత్సాహం వస్తుందని పార్టీ భావిస్తోంది. రాజకీయ వర్గాల్లో కాంగ్రెస్, వైసీపీ మధ్య భవిష్యత్తులో ఏదైనా రాజకీయ సమన్వయం లేదా విలీనం వంటి 'ఘర్ వాపసీ' జరుగుతుందా అనే చర్చలు కూడా తెరపైకి వస్తున్నాయి. అయితే ప్రాంతీయ అస్తిత్వాల రీత్యా ఇవి అంత సులభం కాదని విశ్లేషకులు చెబుతున్నారు. వైసీపీ శక్తిమంతం కావడానికి ఉన్న సవాళ్లు కూడా ఎక్కువగానే కనిపిస్తున్నాయి. 2024 ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత పలువురు ముఖ్య నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు అధికార కూటమి వైపు మళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ వైసీపీలో ఆందోళనకు ఇది కారణమైంది. పార్టీకి పెద్ద సవాలుగా మారింది. దీంతో కేవలం నాయకులు తిరిగి రావడం మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల్లో కోల్పోయిన నమ్మకాన్ని, ముఖ్యంగా మధ్యతరగతి, యువతలో పార్టీపై ఉన్న వ్యతిరేకతను పోగొట్టుకోవడం అత్యవసరమని భావిస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో లేదా పరిపాలనలో విఫలమైతే, ఆ ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవడానికి బలమైన ప్రతిపక్షంగా వైసీపీకి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఏదేమైనా.. ప్రస్తుతం దీనిపై భారీగానే కసరత్తు చేస్తున్నారు.

## నగరంలో మొక్కుబడిగా కులగణన ప్రక్రియ!



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** నగరంలో కులగణన ప్రక్రియ మొక్కుబడిగా సాగుతుందని, పూర్తి స్థాయిలో సమగ్ర కులగణన ప్రక్రియ పూర్తి స్థాయిలో చేయాలనీ సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేసారు. ఈ మేరకు నేడు స్థానిక దాసరి భవన్ లో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ కోటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తముగా ఉన్న పురపాలక సంస్థలలో డివిజన్ల వారీగా ఎస్.సి, ఎస్.టి, బి.సి, మహిళా ల ఓటర్ల సమగ్ర గుర్తింపు ప్రక్రియ ఈ నెల 23వ తేదీ ప్రారంభించి ఈ నెలాఖరు నాటికీ పూర్తి చేయాలనీ రాష్ట్ర ఎన్నికల సంఘం పురపాలక అధికారుల ద్వారా ఆదేశాలు ఇవ్వడం జరిగినది. ఐతే ఈ ఓటర్ల గుర్తింపు ప్రక్రియ ఇంటింటికి తిరిగి నమోదు చేయవలసి ఉన్నది కానీ నగరంలో ఎక్కడ ఆ విధంగా జరుగుతున్న దాఖలాలు లేవని, సంబంధిత సిబ్బంది కేవలం సచివాలయాలకే పరిమితమై వారికీ తోచిన విధంగా, ఇంటి పేరును ఆధారంగా మరియు ఫోన్ల ద్వారా సమాచారం సేకరించి కుల ధ్రువీకరణ చేస్తున్నారని అన్నారు. ఇది పూర్తిగా ఎన్నికల సంఘ విధానానికి విరుద్ధంగా జరుగుతున్న ప్రక్రియ అని అంతేకాకుండా కొన్ని ప్రాంతాలలో స్థానిక అధికార పార్టీ నాయకులు సూచనల మేరకు నమోదు ప్రక్రియ చేపట్టి నివేదిక రూపొందించడం వలన రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో చాల డివిజన్లలో బడుగు,బలహీన వర్గాలు, మహిళలు వారి ప్రాతినిధ్యం కోల్పోయే ప్రమాదం ఉందని, అలాగే ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధంగా ఆ నివేదిక అధికార పక్షానికి అనుకులుగా మారే పరిస్థితి ఉందని తెలియజేసారు. పురపాలక మంత్రిత్వ శాఖ ఇచ్చిన గడువులో ఇప్పటికే మూడు రోజులు భారీ వర్షాల కారణంగా నష్టపోవడం జరిగిందని వెంటనే పూర్తి స్థాయిలో ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహించేందుకు అనువుగా కాలవ్యవధిని పెంచాలని డిమాండ్ చేసారు. ఈ పత్రిక విలేకరుల సమావేశంలో సిపిఐ నగర సహాయకార్యదర్శులు లంక దుర్గారావు, నక్క వీరభద్రరావులు పాల్గొన్నారు.

## పండిట్ దీన్ దయాల్ కు మండల బిజెపి నివాళులు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం రూరల్ మండల బిజెపి ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. బిజెపి మండల అధ్యక్షురాలు పయ్యావుల జయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దీన్ దయాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఏకాత్మ మానవతావాదం ప్రతిపాదించిన గొప్ప సంఘ సంస్కర్త దీన్ దయాల్ అని ప్రశంసించారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక సభ్యులు అంత్యోదయ సిద్ధాంతంతో పేదల సంక్షేమం కోసం కృషి చేసిన మానవతా మూర్తి పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు పయ్యావుల రాము, గణపతి, వైస్ ప్రెసిడెంట్ గల్లా దుర్గ,సెక్రెటర హరిబాబు,నరాల శెట్టి రమేష్ , కొమ్మూరు సత్యనారాయణ, సుధాకర్, పెండ్లి రామారావు,వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# రానున్న ఎన్నికల్లో విజయవాడ నగర మేయర్ పదవి ఎవరికీ దక్కనుంది

● కూటమి నాయకులు ఎవ్వరి ప్రయత్నాల్లో వారు పావులు కదుపుతూనే వున్నారు ● ఇప్పటికే కర్చీఫ్ వేసిన బాడిత శంకర్? ● జనసేన ప్రధాన టీమ్ కి తన బయోడేటా అందించిన బాడిత శంకర్?

(యేమినేని వెంకట రమణ)



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో విజయవాడ మేయర్ పీఠం కోసం రాజకీయ పార్టీలు రాజకీయ ఎత్తుగడలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా అధికార కూటమి లో రాజకీయ సమీకరణాలు పొత్తులు బీటలు భారకుండా మేయర్ పదవి పందారం అన్ని పార్టీల అధిష్టానం కి తలనొప్పి గా మారనుంది. కాగా ఎవ్వరి ప్రయత్నాలు ఎలా వున్నా రాష్టానికి గుండె కాయ లాంటి విజయవాడ నగర మేయర్ పదవికి ఏఏ రాజకీయ పార్టీలు ఎవ్వరిని బరిలో దింపినా విజయం సాదించ సత్తా ఉన్నావారే కావాలి. ఎన్నికల్లో అనధికా రకంగా ఖర్చు చేయడానికి కోట్లు కుమ్మరించాలి. దానికి సిద్దమైన వారే ఆసీటుకోసం ప్రయత్నం చెయ్యాల్సిన పరిస్థితి నేడు నెలకొంది. విజయవాడ నగరంలో మేయర్ సీటు ఆశిస్తున్న వారిలో ప్రధమంగా జనసేన పార్టీ నాయకులు బాడిత శంకర్ పేరు తెరపైకి వస్తోంది.విజయవాడ ప్రజలందరికీ సుపరిచితుడు 35 సంవత్సరాలుగారాజకీయ సీనియర్ నేతకి. జనసేన పార్టీ. మేయర్ గాఅవకాశం కల్పిస్తే తాను సిద్దమని బాడిత శంకర్ అన్నట్టు ప్రచారం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం సహకారంతో జనసేన పార్టీ అధ్యక్షుడురాష్ట్ర ఉపముఖ్యమంత్రి. పవన్ కళ్యాణ్. ఆదేశిస్తే మేయర్ గా అవకాశం కల్పిస్తే తా ను సిద్ధంగా ఉన్నానని. జనసేన పార్టీ సీనియర్ నాయకుడు. బాడిత శంకర్ అన్నారనే ప్రచారం జరుగుతుంది.విజయవాడ నగరంలో రాజకీయపరంగాగత 35 సంవత్సరాల పైగా రాజకీయాల్లో ఉంటూ విజయవాడ నగరంలోవేలాదికొద్ది కార్యక్రమాలను చేసినటువంటి అనుభవం శంకర్ కి ఉంది.మరియుముఖ్యంగా. రాష్ట్ర ప్రజలందరూ మెచ్చుకునే ప్రజానేత వంగవీటి మోహన్‌రంగా మాజీ ఎంపీలు. ఉపేంద్ర తో.ఎంపీ లగడపాటి రాజగోపాల్,. సీనియర్ మైనార్టీ నేత. ఎమ్మెల్యే జలీల్ఖాన్.. ఇలా రాజకీయ ఉద్దండులుతో కలిసి శంకర్ ప్రయాణం చేశారు .ముఖ్యంగా జాతీయ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్త స్థాయి నుంచి యూత్‌కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా., ఇంకా కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులుచేపట్టి ఆపార్టీ విజయానికి ఆ సమయంలో ఎంపీలకు..ఎమ్మెల్యేలకు..కార్పొరేటర్లకు. వాళ్ళ విజయాలకు పార్టీ ఆదేశాలతోసమయస్ఫూర్తితో పనిచేసిన వ్యక్తి ఆయన. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయాలను నచ్చి.. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలనుచూసి. నేను జనసేన పార్టీలో పవన్ కళ్యాణ్ సమక్షంలో చేరడం జరిగింది... ఆ తర్వాత జనసేన పార్టీవ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్. వారాహి యాత్రలో ఆయనతోపాటు ప్రయాణంలో పాల్గొన్నారు . రాష్ట్ర ప్రజల్లో ఆయన కొన్న క్రేజీ.. రాష్ట్ర ప్రజల్లో ఆయనపై ఉన్న నమ్మకం..ఇలా పవన్ కళ్యాణ్ కి ఆ రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో. ఈరోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎంగా కొనసాగుతూ,,రాష్ట్ర ప్రజలందరూ ఆశించే విధంగా పల్లెలను అభివృద్ధి బాటలో కృషి చేస్తున్నారు.విజయవాడ నగరం అభివృద్ధి చెందా లంటే ఈ సారి జనసేన పార్టీ అభ్యర్థి కే ఈ సీటు క కెటాయించాలని జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.కాగా విజయవాడ నగర మేయర్ పదవికి పోటీలో ఉన్నారా అని బాడిత శంకర్ ని "వార్త ప్రభ ప్రతినిధి "అడుగ్గా తాను తన బయోడేటా జనసేన ప్రధాన టీమ్ కి అందించానని సీటు ఆశించడంలో తప్పులేదుగా..... అధిష్టానం ఆదేశాలు ఎలా వున్నా గాని తాను జనసేన పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని బాడిత శంకర్ సమాధానం ఇచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ ● స్రమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం ● ప్రశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం మల్లికార్జునపేటలోని పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను బుద్ధా వెంకన్న దృష్టికి తీసుకువచ్చి అర్జీలు సమర్పించారు.ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని బుద్ధా వెంకన్న గారు స్వయంగా స్వీకరించి, వారి సమస్యలను సావధానంగా విన్నారు. ఇళ్ల స్థలాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ప్రజా దర్బార్‌కు వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల మేరకు పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని బుద్ధా వెంకన్న తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చొరవ చూపడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు."ప్రజల సమస్యలను వినడమే కాకుండా, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తాం. పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం" అని బుద్ధా వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో చందన సురేష్, సాదరబోయిన ఏడుకొండలు, అమర మురళి, ఈగల సాంబ, పేరం సత్యనారాయణ, కుంచం దుర్గారావు, భవాని ప్రసాద్, యేదుపాటి రామయ్య, గోలి శీను,తుపాకుల రమణమ్మ , పితాని పద్మ , కే మల్లేశ్వరి, పీ దుర్గా, లక్క శాంతమ్మ, కొట్టేటి సరిత, శాంతి, ఎర్రంశెట్టి పద్మ , కామాక్షి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వల్ల కలిగే వ్యాధులను నిర్మూలిద్దాం



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంటిలో ప్రతి శుక్రవారం డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం ఉడా కాలనీ రోడ్, రాజీవ్ నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు దోమల నివారణపై సూచనలు అందించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ మాట్లాడుతూ నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు విజయవాడ నగరపాలక సంస్థ శాస్త్రీయ పద్ధతుల్లో విస్తృత చర్యలు చేపడుతోందన్నారు. ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టి ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా నిరంతర చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాక్టర్ ఆధారిత ప్రత్యేక యంత్రాలు, బోట్ల సహాయంతో కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కలు, చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలను తొలగిస్తున్నామని చెప్పారు.సిబ్బంది చేరుకోలేని ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేసి దోమల లార్వా పెరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిరంతరం ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ నిర్వహించడంతో పాటు, దోమల లార్వాను ఆహారంగా తీసుకునే గాంబూసియా చేపలను నీటి వనరుల్లో విడిచిపెట్టి జీవసంబంధిత పద్ధతులను కూడా అమలు చేస్తున్నామని వివరించారు.నగరపాలక సంస్థ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకరోజు, ముఖ్యంగా ప్రతి శుక్రవారం 'డ్రై డే'గా పాటించి, ఇంటి లోపల, బయట, డాబాపై మరియు పరిసర ప్రాంతాల్లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.వాడుకలో లేని బకెట్లు, మగ్గులు, తొట్లు, డ్రమ్ములు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, కూలర్లు, ఫ్రిజ్ ట్రేలు, నీటి నిల్వ ఉండే ఇతర పాత్రలను ప్రతి శుక్రవారం తప్పనిసరిగా పరిశీలించి వాటిలోని నీటిని పూర్తిగా పారబోయాలని సూచించారు. కేవలం ఐదు నుంచి ఏడు రోజుల పాటు నిల్వ ఉన్న నీటిలోనే దోమల లార్వా వేగంగా అభివృద్ధి చెందుతుందని, అందువల్ల వారానికి ఒకసారి నీటి నిల్వలను తొలగించడం ద్వారా దోమల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.అవగాహన కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి ప్రజలకు ప్రత్యక్షంగా చూపిస్తూ, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని శాశ్వతంగా నియంత్రించవచ్చని వివరించారు. పరిశుభ్రమైన పరిసరాలు, ప్రజల అప్రమత్తత, నగరపాలక సంస్థ చర్యలు కలిసివస్తేనే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను పూర్తిగా నియంత్రించగలమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు సబ్ యూనిట్ ఆఫీసర్ ఇంచార్జి ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ క్రాంతి కుమార్, రాజేంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మలేరియా విభాగం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల కుల గణన సర్వేపై ప్రత్యేక దృష్టి

## 86 వార్డుల్లో ఇంటింటి సర్వే పురోగతిపై డెప్యూటీ కమిషనర్ జి. సృజన సమీక్ష



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు రానున్న పురపాలక ఎన్నికల నేపథ్యంలో నగరంలో నిర్వహిస్తున్న ఓటర్ల కుల గణన సర్వే ప్రక్రియపై సిబ్బందితో డెప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి. సృజన శుక్రవారం హైమావతి కళ్యాణమండపం, చిట్టినగర్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 86 వార్డుల్లో సిబ్బంది చేపడుతున్న ఇంటింటి సర్వే పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు.ప్రతి వార్డులో ఇప్పటివరకు పూర్తయిన సర్వే వివరాలు, ఇంకా పూర్తి చేయాల్సిన సర్వే వివరాలను వార్డుల వారీగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వేను మరింత వేగవంతంగా, పక్కాగా నిర్వహించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఓటర్లను నిబంధనల ప్రకారం కచ్చితంగా గుర్తించి మార్కింగ్ చేయాలని ఆదేశించారు. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్లను ఎన్నికల సంఘం నిర్దేశించిన రంగుల మార్కింగ్ విధానంలోనే గుర్తిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రతి ఇంటిని సందర్శించి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని డెప్యూటీ కమిషనర్ జి. సృజన సూచించారు.సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, మిగిలిన సర్వేను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు నమోదు చేసిన వివరాల్లో ఖచ్చితత్వాన్ని నిర్ధారించాలని సిబ్బందికి సూచించారు.ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, శానిటేరీ ఇన్స్పెక్టర్లు, సి ఓ లు, బిఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సుష్మా గౌడ్ 24వ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు





**గుంటూరు టౌన్ సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** సుష్మా గౌడ్ ఫౌండేషన్ అధ్యక్షులు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన వివిధ ప్రాంతాల్లో ప్రతిభ కనపరిచి న10మంది నిరుపేద విద్యార్థినీ, విద్యార్థులకు 1,60000 ఒక లక్ష అరువది వేల రూపాయలఉపకారవేతనాలు ఆన్ లైన్ ద్వారా పంపిణీ చేయడం జరిగింది. గుంటూరు మాతృశ్రీ చిల్డ్రన్స్ హోమ్ నందు 25 మంది చిన్నారులకు నూతన వస్త్రాల పంపిణీ మరియు 25 మంది చిన్నారులకు ప్రేమతో భోజనాలు ఏర్పాటు చేశారు. శ్రీనివాస్ గౌడ్ తన ప్రసంగం లో మాట్లాడుతూ సుష్మా గౌడ్ వర్ధంతి పుట్టినరోజు, మాకు ఒక బాధ్యత.ఆ చిట్టి తల్లిని మేము సేవా కార్యక్రమాల ద్వారా చూసుకుంటున్నాం.ఆ చిట్టి తల్లి ఆశీస్సులు ఈ ట్రస్ట్ ద్వారా సహాయం పొందిన అందరికీ ఉండాలని మనసు పూర్తి గా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సుష్మా గౌడ్ ఫౌండేషన్ అధ్యక్షులు జల్లెడ శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి జల్లెడ ఓంకారం,సహ కార్యదర్శి హరిత గౌడ్,ఉపాధ్యక్షులు నాగ వెంకటశివప్రసాద్,ప్రధాన కార్యదర్శి జల్లెడ సుష్మ రావు గౌడ్,కోశాధికారి జల్లెడ జయసుస్మిత గౌడ్,సహ కోశాధికారి నందన్ గౌడ్,మాతృశ్రీ చిల్డ్రన్స్ హోమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ఆధ్వర్యంలో ఘనంగా లక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన

### ఐశ్వర్య ప్రదాయిని లక్ష్మీ అమ్మవారు



**చెరుకుపల్లి మండలం సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గుళ్ళపల్లి శ్రీ గంగాంబికా సమేత ఆనందీశ్వర స్వామి దేవాలయం (మూడుగుళ్ల శివాలయం) వద్ద మంగళవారం నుండి శుక్రవారం వరకు జరిగిన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం తో ముగిశాయి. మహిళలతో ఘనంగా లక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిటిడి సేవా సభ్యులు పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ లక్ష్మీ అమ్మవారిని పూజించటం వల్ల సకల ఐశ్వర్య భోగభాగ్యాలు కలిగి సుమంళులుగా వర్ధిల్లి శుభాలు కలుగుతాయని తెలియజేశారు. ఆలయ అర్చకులు రాంబాబు స్వామి మహిళల చేత విఘ్నేశ్వర పూజ లక్ష్మీ అమ్మవారి అష్టోత్తర శతనామ పూజా కార్యక్రమాలు చేయించారు. పూజలో పాల్గొన్న వారి అందరికీ పొన్నపల్లి సునీల లక్ష్మీ అమ్మవారి రూపులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారకులు జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అంకిత భావం గల నేత పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):** అంకితభావం, దేశభక్తి గల నేత పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని కొనియాడారు కొండపల్లి పట్టణ అధ్యక్షురాలు తమ్మినైనా మాధురి సుదీష్ణ.దీన్ దయాళ్ జయంతి సందర్భంగా కొండపల్లి బిజెపి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాధురీ మాట్లాడుతూ దీన్ దయాళ్ దేశభక్తి, అంకితభావం,వారి సేవలను అందరికీ వివరించారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రధాన కార్యదర్సులు దాము భవాని, నాగమణి, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు రేగళ్ళ రఘునాథ్ రెడ్డి,జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కునాల యుగంధర్,చల్లా ఆంజనేయులు, నరసింహారావు, పార్ధసారధి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈ సత్యము! తెలుసుకో!

చలువ రాతి మేడలో
కలువ పూల పాన్పులో
పరుండినా వృధా! వృధా!
శాంతి లేక మనసులో
సిరి సంపదల దీవిలో
రాజు వారి కోటలో
ఎక్కడున్నా తప్పదు
మరణం విడిచి పెట్టదు
ఎవ్వరూ ఆపలేరు
ఇల జీవాన్ని కొనలేరు
ఎన్నెన్నో సృష్టిలో
ఈలాంటివి బ్రతుకులో
వద్దు అహంకారమే
ఎప్పుడూ వెటకారమే



తెలుసుకో ఈ సత్యము
చివరికదే ప్రమాదమే

**గద్వాల సోమన్న**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# దేవస్థానం అప్రమత్తంతో తప్పిన కొండచరియల ముప్పు

**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరంలో గత రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాల ప్రభావంతో గురువారం రాత్రి ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. రానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఘాట్ రోడ్డు మరమ్మతు పనుల కోసం గత మూడు రోజులుగా అధికారుల ముందస్తు నిర్ణయంతో ఘాట్ రోడ్డును పూర్తిగా మూసివేయడం వలన, శ్రీ కనకదుర్గ అమ్మవారి అనుగ్రహంతో ఎవరికీ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పెను ప్రమాదం తప్పింది.?ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ శుక్రవారం ఉదయం దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ మరియు ఇంజినీరింగ్ విభాగం అధికారులతో కలిసి ఘాట్ రోడ్డులోని ప్రభావిత ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు.కొండపై నుండి ఘాట్ రోడ్డుపై జారిపడిన భారీ బండరాళ్లు, రాతిపెళ్లలు, మట్టిని వెంటనే పొక్లెయిన్లు, క్రేన్ల సహాయంతో యుద్ధప్రాతిపదికన తొలగించి మార్గాన్ని శుభ్రం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.?కొండచరియల పై వర్షపు నీటి ఊట కారణంగా మట్టి నానిపోయి ఉందని,ఇంకా ఎక్కడైనా కొండచరియలు జారే అవకాశాలు ఉన్నాయా అనే అంశాన్ని సాంకేతిక నిపుణులతో క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రమాదకరంగా ఉన్న వదులైన రాళ్లను ముందుగానే గుర్తించి నియంత్రిత పద్ధతిలో తొలగించాలని



సూచించారు.కొండచరియలు పడిన ప్రాంతంలో రిటైనింగ్ వాల్ (రక్షణ గోడ) మరియు ఐరన్ ఫెన్సింగ్ రాక్-ఫాల్ నెట్లను మరింత పటిష్టంగా పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.?ఘాట్ రోడ్డును పూర్తిగా పునరుద్ధరించేందుకు క్షేత్రస్థాయిలో భద్రతా తనిఖీలు పూర్తిచేసే వరకు ఘాట్ రోడ్డు వైపునకు ఎవరినీ అనుమతించవద్దని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఏర్పాట్లు పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.?ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనానాయక్ మాట్లాడుతూ.. అకాల వర్షాల నేపథ్యంలో తాము నిరంతరం అప్రమత్తంగా ఉన్నామని,గురు వారం రాత్రి తాను ఘాట్



రోడ్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఇంజినీరింగ్ సిబ్బందిని అప్రమత్తం చేయడం, ముందుజాగ్రత్త చర్యగా ఘాట్ రోడ్డు మూసివేత వల్ల పెద్ద ముప్పు తప్పిందని తెలిపారు.దేవాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామ నారాయణ రెడ్డి, దేవాదాయ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు,కమిషనర్ కె. రామచంద్ర మోహన్ ఘాట్ రోడ్ పరిస్థితి పై ఎప్పటికప్పుడు తెలుసుకొని, తక్షణచర్యలు తీసుకోవాలని ఆదేశించారని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ బృందాలు రంగంలోకి దిగి పనులను వేగవంతం చేశాయని పేర్కొన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. రమ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, దేవస్థాన అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## చేతి వృత్తుదారులకు 50 ఏళ్లకే పెన్షన్ ఇవ్వాలి

**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేతువృత్తులు విభాగం రాష్ట్ర అధ్యక్షులు తోలేటి శ్రీకాంత్**



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి) తాడేపల్లిగూడెం డిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం మొదటి కార్యవర్గ సమావేశం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతివృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విశ్వబ్రాహ్మణులందరూ ఐక్యంగా ఉండాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలు పోరాడి సాధించుకోవాలని అన్నారు ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు ముఖ్యంగా విశ్వబ్రాహ్మణుల కుల వృత్తులైన స్వర్ణకార, వడ్రంగి, కంచర, కమ్మర, శిల్పి వృత్తిదారులందరికీ 50 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు చేతి వృత్తిదారులు పనులు లేక నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగిపోయి అల్లాడుతున్నారని అన్నారు వారిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గురజాడ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఈరోజు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం సమావేశం జరిగిందని రానున్న రోజుల్లో అన్ని జిల్లాల్లో విశ్వబ్రాహ్మణుల చైతన్యపరిచి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందేలా కృషి చేస్తానని అన్నారు అదేవిధంగా విశ్వబ్రాహ్మణ సంఘ ఐక్యత కోసం సంఘము ఎన్నికలకు తన వంతు సహకారం చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమాన్ని ముందుగా శ్రీ విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి పీఠం అధ్యక్షులు చింతాడ బ్రహ్మానందం గారు పూజా కార్యక్రమం నిర్వహించారు అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి చేతివృత్తిదారులకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయానికి పోస్ట్ కార్డు ద్వారా తమ డిమాండ్ ను పంపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మెడపి ప్రసాద్, వేముల రామకృష్ణ, కిల్లంపల్లి ఆచారి, కొండిపర్తి రాజశేఖర్, కల్లూరి శ్రీవాణి, వేముల కన్నబాబు,బి శారద తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అవార్డు గ్రహీత

**సిఈఓ ఆవుల చంద్రశేఖర్ కు ఘనసత్కారం**




**కడప, సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు (ఏపీఎంఏపీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ), డిప్యూటీ కన్జర్వేటర్ ఆవుల చంద్రశేఖర్ ను కడపలో శు క్రవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హౌస్ లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నుంచి అంతర్జాతీయ అవార్డు అందుకున్న సీఈవో చంద్రశేఖర్ కృషిని పలువురు ప్రశంసించారు. కడపలోని అటవీశాఖ అతిథిగృహంలో శు క్రవారం ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిఎఫ్ఓ రాజశేఖర్ సిఈఓ విశిష్ట సేవలను ప్రత్యేకంగా అభినందించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం లోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టికృషి తోనే తనకు అంతర్జాతీయ అవార్డు దక్కిందని ఏపీఎంఏపీ సిఈఓ ఆవుల చంద్రశేఖర్ ఈ సందర్భంగా అన్నారు. తన విజయం వెనక ఎందరో కృషి దాగి వుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో తనకు ఎంతగానో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి సిఈఓ ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ రికార్డు సాధించేలా ప్రోత్సహించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, మంత్రి సత్యకుమార్ కు, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప ఉప డిఎఫ్ఓ స్వామి వివేకానంద, ఏవో ఆరిపుల్లా, పలువురు విద్యార్థులు, పర్యావరణవేత్తలు, ఇతర అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పిల్లలను కాపాడిన ఏఎస్ఐ మంగ్యా నాయక్



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 25 (వార్తప్రభ)** ధనంబోడు కాలనీకి చెందిన ఆమె పై తన భర్త మరియు తన అత్తగారు నీవు మగ పిల్లలను కన్నావు వాళ్ల వల్ల ఉపయోగం ఏంటి అని అస్తమానం అవమానించడంతో శుక్రవారం కృష్ణా నదిలో పడి తన ఇద్దరు పిల్లలు తో సహా చనిపోవాలని కృష్ణా నదిలో దూకుతూ ఉండగా అక్కడే వినాయక నిమజ్జం డ్యూటీలో ఉన్న ఏఎస్ఐ మంగ్యా నాయక్ మరియు ఏఆర్ కానిస్టేబుల్ అప్పలరాజు పిసి 519, మరియు ఏఆర్ కానిస్టేబుల్ 371,లు మందోబస్తు డ్యూటీలో ఉండగా సడన్గా తల్లి ఇద్దరు పిల్లలు నదిలో దూకుతూ ఉండగా గమనించి వారిని పట్టుకొని కౌన్సిలింగ్ నిర్వహించారు.వాళ్ళ అమ్మ ని పిలిపించి అప్పగించటం జరిగిందని తెలిపారు.

## భారీ వర్షాలకు ముస్తాబాద్‌లో 600 ఎకరాల పంట నీటమునక

**బాధితులకు పరిహారం అందించాలని కౌలు రైతు సంఘం డిమాండ్**



**గన్నవరం, సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గన్నవరం మండలం ముస్తాబాద్‌లోని పెద్ద చెరువు, పేద చెరువులు నిండి పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలోని సుమారు 600 ఎకరాలకు పైగా పంట పొలాలు నీట మునిగాయి. నిలువెల్లా నష్టం వాటిల్లుతుందనే భయంతో స్థానిక రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చెరువుల ఉధృతికి ముస్తాబాద్ గ్రామం పూర్తిగా జలదిగ్బంధనంలో చిక్కుకుంది. విజయవాడ, సూరంపల్లి, కేసరపల్లి తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారులన్నీ నీట మునగడంతో రాకపోకలు స్తంభించి, గ్రామం బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయింది.ఈ దయనీయ పరిస్థితిని పరిశీలించేందుకు శుక్రవారం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు ముస్తాబాద్ పరిసర ప్రాంతాల్లోని నీట మునిగిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.వి. లక్ష్మణస్వామి మాట్లాడుతూ, జిల్లాలో కురిసిన విపరీతమైన వర్షాల వల్ల ఎన్నడూ లేని విధంగా ముస్తాబాద్ ప్రాంతంలో 600 ఎకరాల పంట నీట మునిగి పూర్తిగా ధ్వంసమయ్యే స్థితికి చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించి, నష్టాన్ని అంచనా వేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులకు తగిన పరిహారం చెల్లించే విధంగా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి కైలే ఏసుదాసు, రైతు సంఘం నాయకులు బొడ్డు బాలశౌరి, కళ్ళం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటటమే కాదు వాటిని సంరక్షించాలి - డిపిఓ సీతామాలక్ష్మి

**హాజరత్ సయ్యద్ షా బుఖారీ బాబా ఆస్థాన లో మొక్కలు నాటే కార్యక్రమం**




**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):**మొక్కలు నాటటమే కాదు వాటిని సంరక్షించాలని సూచించారు జిల్లా పంచాయతీ అధికారిని టి సీతామహాలక్ష్మి. కొండపల్లిలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజ్రత్ సయ్యద్ షాబుఖారి ఆస్థాన లో గ్యార్మీ షరీఫ్ గౌస్-ఏ-పాక్ పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.హజరత్ సయ్యద్ షా బుఖారీ బాబా ఆస్తానా సజ్జాదా నషీన్ హజ్రత్ సూఫీ అల్తాఫ్ బాబా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి ముఖ్య అతిథిగా హాజరై ఆస్థాన ప్రాంగణంలో మొక్కలు నాటారు. అమెరికా నుండి వచ్చిన మహిళ ప్రముఖులు లిండ్ సే, అలెక్స్ ప్రత్యేక ఆకర్షణగా, దర్గాలో




ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు "గ్రీన్ ఆస్థాన -- క్లీన్ ఆస్థాన మన బాధ్యత" అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీతామహాలక్ష్మి మాట్లాడుతూ ఆస్థాన పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అల్తాఫ్ బాబా మాట్లాడుతూ అనివార్యం కారణాలవల్ల కార్యక్రమానికి రాలేకపోయినా కలెక్టర్లకు బాబా వారి ఆశీస్సులు ఉండాలని, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటే కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు డిపిఓ.ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కో ఆప్షన్ సభ్యులు మహబూబ్ సుభాని, గ్రేస్ మినిస్టర్స్ ఫాదర్ ఎలీషా, ఎస్ ఎన్ జి ఫౌండేషన్ అధినేత కె శారద వాణి, లైన్స్ క్లబ్ గొల్లపూడి కీర్తి క్లబ్ ప్రెసిడెంట్ కేవిడి ప్రసాద్, అందించాలని డిమాండ్ చేశారు.గత మూడు రోజులుగా కురుస్తున్న

## కొండ ప్రాంతాల్లో ప్రజల భద్రత గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం..

**రిటైనింగ్ వాల్స్ నిర్మించకుండా మాటల గారడీ : సీపీఎం నేత బోయి సత్యబాబు**

**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు విమర్శించారు. భారీ వర్షాలతో రిటైనింగ్ వాల్స్ కూలి ఇళ్లపై మట్టి, రాళ్లు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు.51వ డివిజన్ శ్రీనివాస్ మహల్ కొండ ప్రాంతంలో గురువారం రాత్రి రిటైనింగ్ వాల్ కూలి పెంకె కుంచమ్మ ఇంటిపై మట్టి, రాళ్లు పడటంతో ఆమె గాయాలతో బయటపడ్డారని తెలిపారు. పలు ఇళ్లు పూర్తిగా ధ్వంసంకాగా, మరికొన్ని ఇళ్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తక్షణం పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం



భారీ వర్షాలకు పశ్చిమ నగరంలోని 45, 48, 49, 50, 51 డివిజన్లలో రిటైనింగ్ వాల్స్ దెబ్బతిన్నాయని, వాటిని యుద్ధప్రాతిపదికన పునర్నిర్మించాలని కోరారు. విజయవాడ నగరంలోని 16 కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి వెంటనే రూ.100 కోట్ల గ్రాంటు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నగర అభివృద్ధికి మంజూరైన నిధులను కూడా తక్షణం విడుదల చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.రిటైనింగ్ వాల్స్ నిర్మాణాలకు నిధులు విడుదల చేయకుండా కేవలం ప్రకటనలు, హామీలతో కాలయాపన చేయడం సరికాదని బోయి సత్యబాబు మండిపడ్డారు. సీపీఎం బృందం ఆయా కొండ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం పర్యటించి ప్రజల సమస్యలను పరిశీలించి మున్సిపల్ కమిషనర్, అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.ఈ పర్యటనలో సీపీఎం పశ్చిమ నగర నాయకులు పి.రాజు, పి.సూరిబాబు, కె.సత్యనారాయణ, పి.శ్రీను, ఎల్.లక్ష్మీనారాయణ, జి.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి




**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)**విద్యార్థినులు పారిశ్రామికరంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని భారతీయ యువశక్తి ట్రస్ట్ సీనియర్ మెంటర్ కే శశికుమార్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఇండస్ట్రీ -- ఇన్స్టిట్యూషన్ ఇంటరాక్షన్ సెల్, సీఎస్ఈ--ఏఐ విభాగాల ఆధ్వర్యంలో మహిళా సాధికారత, మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధి



అంశంపైసదస్సును ఆ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన కే శశికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపార ఆలోచనలను అభివృద్ధి చేసుకోవాల న్నారు. తద్వారా పారిశ్రామిక రంగంలో ఉన్న అవకాశాలు, సదుపాయాలు, సాయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే అవసరమైన నైపుణ్యాలకు పదును పెట్టాలన్నారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తే మంచి విజయాలు సొంతమవుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాలపై మరింత పట్టు సాధించి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఆ దిశగా విద్యార్థులకు అవసరమైన వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు.

## నెర్నూరు అంగన్వాడీలో పోషకాహార మాసోత్సవం



**చేజర్ల సెప్టెంబర్ 25 (వార్తాప్రభ)** స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే పోషణ మాసోత్సవాల్లో భాగంగా నెర్నూరు అంగన్వాడీ కేంద్రం నందు అంగన్వాడీ మాసోత్సవం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తల్లులందరినీ సమావేశపరిచి భోజనం గురించి వివరిస్తూ ప్రతి రోజూ తీసుకునే భోజనంలో కార్బోహైడ్రేట్స్ ప్రోటీన్స్ విటమిన్స్ మినరల్స్ ఉండేటట్లు రోజు సమతుల్య ఆహారం తీసుకోవాల్సిందిగా తల్లులకు తెలియజేసారు. అలాగే అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు ఆటపాటల ద్వారా విద్య నేర్చుకుని చాలా యాక్టివ్ గా ఉంటారని తెలిపారు.పిల్లల ద్వారా యాక్టివిటీస్ చేయించి తల్లులకు చూపించడం జరిగింది. ప్రవేట్ పాఠశాలకు అంగన్వాడీ కేంద్రానికి గల తేడాలను వివరిస్తూ తల్లులందరూ పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి పంపాలని అవగాహన కల్పించడం జరిగిందని సెక్టార్ సూపర్వైజర్ ఎం.పద్మ వివరించారు.అంగన్వాడీ కేంద్రానికి పిల్లలను పంపే తల్లులకు సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది.ఈ కార్యక్రమం నందు సూపర్వైజర్ పద్మ ఎంఎల్ హెచ్ పి.మాధురి ఏఎన్ఎం సుభాషిని ఆశా కార్యకర్త అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



**చేజర్ల సెప్టెంబర్ 25 (వార్తాప్రభ)** ప్రాధమిక ఆరోగ్య కేంద్రము చేజర్ల పరిధిలోని చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డి వార్మింగ్ డే) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా చేజర్ల ప్రాధమిక ఆరోగ్య కేంద్రము ప్రధాన వైద్య అధికారి శ్రీమతి డా.షేక్ మెహతాబ్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు తప్పనిసరిగా ఈ ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రను వేసుకోవాలని తరచుగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని అలాగే వ్యక్తిగత పరిశు భ్రత మరియు పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.ఆల్బెండజోల్ మాత్రలు తినడం వలన రక్తహీనత దరి చేరదని విద్యార్థులు చక్కగా ఆసక్తితో చదువుకోగలరని విద్యార్థులకు ఆరోగ్య విద్యను అందించడం జరిగుతుందని అలాగే మన చేజర్ల ప్రాధమిక ఆరోగ్య కేంద్రము పరిధిలో నిర్దేచించిన అన్ని పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాలలో ఈ కార్యక్రమం విజయవంతం చేయడం జరిగినది తెలిపారు. ఈ కార్యక్రమం అన్ని పాఠశాలల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు పిల్లల తల్లితండ్రుల సహకారంతో స్థానిక వైద్య సిబ్బంది మరియు అంగన్వాడీ సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంను విజయవంతం చేయడమైనది.అలాగే ఈ రోజు మిస్ ఐన పిల్లలకు. 05.10.2026 రోజున మరలా వేయడం జరుగుతుందని చేజర్ల పి.హెచ్.సి. ప్రధాన వైద్య అధికారి డా.శ్రీమతి షేక్ మెహతాబ్ తెలియజేసారు.

## కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



**చేజర్ల సెప్టెంబర్ 25 (వార్తాప్రభ)** చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నేషనల్ డి వార్మింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ జ్ఞానేశ్వరి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు తప్పనిసరిగా ఈ ఆల్బెండజోల్ 400 మిల్లీ గ్రాముల మాత్రను వేసుకోవాలని ప్రతినిత్యం శుభ్రంగా చేతులు కడగాలని కోరారు.తద్వారా కడుపులో ఎలాంటి ఇన్ఫెక్షన్స్ సమస్యలు రక్తహీనత దరి చేరవని విద్యార్థులు చక్కగా ఆసక్తితో చదువుకోగలరని తెలియపరచారు.ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ పవిత్ర కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు



**అనుమసముద్రంపేట సెప్టెంబర్ 25 (వార్తాప్రభ)** భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక ప్రముఖులు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమాన్ని ఏఎస్ పేట మండల బిజెపి అధ్యక్షులు గోవిం దుల వాసు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమానికి బిజెపి ఉపాధ్యక్షులు నీలం నారాయణ పందిటి బాబు మండల బిజెపి ప్రధాన కార్యదర్శి అన్యం శ్రీనివాసులు కార్యదర్శి గరికపాటి మస్తానయ్య మరియు బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## సెప్టెంబర్ 27న గన్నవరంలో ఉచిత వైద్య శిబిరం



**గన్నవరం, సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** గన్నవరం పరిసర ప్రాంత ప్రజలకు, ముఖ్యంగా షుగర్, బి.పి., ఫిట్స్ (మూర్ఛ), పక్షవాతం వంటి సమస్యలతో బాధపడుతున్న బాధితులకు జీబీఆర్ ఫౌండేషన్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం మరియు మానవత సేవా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న (ఆదివారం) ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. అమరజీవులు కొసరాజు నాగేశ్వరరావు, చిరంజీవి, టాన్యాకుమారీల జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ?ఈ వైద్య శిబిరం గతంలో ప్రకటించిన రోటరీ కల్యాణ మంటపానికి బదులుగా, గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఉన్న 'చింతపల్లి పాపారావు భవనం'లో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7:00 గంటల నుంచి 11:00 గంటల వరకు ఈ క్యాంపు అందుబాటులో ఉంటుంది. ప్రముఖ నరాల వైద్య నిపుణులు డాక్టర్ గోపాళం శివన్నారాయణ సారథ్యంలో డాక్టర్ సి అంజనీకుమార్, డాక్టర్ ఎన్ డి శ్రీనివాసరావు, డాక్టర్ వి మనస్వీ, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ యలమంచిలి శ్రవంతి తదితర నిపుణులైన వైద్యుల బృందం రోగులను పరీక్షించి సలహాలు, సూచనలు అందిస్తారు. పరీక్షల అనంతరం రోగుల నివేదికలను పరిశీలించి, రెండు నెలలకు సరిపడా మందులను కేవలం రూ. 200 లకే అందజేస్తారు. అలాగే ఇన్సులిన్‌ను కూడా అతి తక్కువ ధరకే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అంతేకాకుండా, శిబిరానికి వచ్చే వారి కోసం ముందు రోజు శనివారం ఉదయం 7:00 నుండి 8:30 గంటల మధ్య మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో సిపియం పార్టీ ఆఫీస్ వద్ద ఉచితంగా షుగర్ (ఫాస్టింగ్), బి.పి. పరీక్షలు నిర్వహిస్తారు. బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నామని నిర్వాహకులు అనుమోలు వెంకటేశ్వరరావు, మరీదు వరప్రసాద్, సూరగని సాంబశివరావు, మిరప నాగేశ్వరావు తెలియజేశారు. ఇతర సమాచారం కోసం 9885193432, 9441044571, 9494888849, 9441274388 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు అని వివరించారు.

## కళ్యాణి డ్యాంను పరిశీలించిన కమిషనర్ ఎం.జయకృష్ణ



**తిరుపతి : సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** తిరుపతి నగరానికి ప్రధాన తాగునీటి వనరు అయిన కళ్యాణి డ్యాంను శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ సిబ్బందితో కలిసి సందర్శించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో డ్యాంలో నీటి నిల్వలు, ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నగరానికి తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించాలని, పంపింగ్ వ్యవస్థను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్యాంసుందర్, డి ఈ మధు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో రూ.7,00,116కు బొజ్జ గణపయ్య మహా లడ్డు ప్రసాదం

**కైవసం చేసుకున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు**



**కూకట్ పల్లి, సెప్టెంబర్ 25(వార్తాప్రభ):**కూకట్‌పల్లి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో కొలువుదీరిన శ్రీ బొజ్జ గణపయ్య (బీజేపీ గణేష్) స్వామివారి మహా లడ్డు ప్రసాదం 2026 సంవత్సరానికి గాను రికార్డు స్థాయిలో వేలం పాటలో దక్కింది. శుక్రవారం బిజెపి ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డు వేలం పాటలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు రూ. 7,00,116/లకు లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. 11 రోజుల పాటు ఎంతో నిష్టగా, భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య లడ్డు ప్రసాదాన్ని ఈ ఏడాది రికార్డు స్థాయి ధరకు దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. గతంలో ఉన్న వేలం రికార్డులను అధిగమిస్తూ రూ. 7,00,116/-లకు లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు, ఈ అవకాశాన్ని స్వామివారి ఆశీస్సులుగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు గారు మాట్లాడుతూ 51 సంవత్సరాలుగా కూకట్‌పల్లి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కల్పిస్తున్న నిర్వాహకుల సేవలు అభినందనీయమని అన్నారు. గణనాథుని సేవలో భాగంగా లడ్డు ప్రసాదాన్ని వేలం ద్వారా దక్కించుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని, ఈ సంవత్సరం బొజ్జ గణపయ్య మహా లడ్డు ప్రసాదాన్ని దక్కించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. స్వామివారి కృపకు పాత్రుడిగా ఈ పవిత్ర ప్రసాదాన్ని దక్కించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని, శ్రీ బొజ్జ గణపయ్య ఆశీస్సులు కూకట్‌పల్లి ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నట్లు వడ్డేపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. ఈ లడ్డు ప్రసాదం ద్వారా భక్తి, సేవ, సౌభ్రాతృత్వం మరింత పెంపొందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ గణనాథుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వినాయక భక్త బృందం నిర్వాహకులు, సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామీణ మార్పుకు బాటలు వేస్తున్న పారిశ్రామికవేత్తలకు 'బెటర్ వే అవార్డ్స్'

**- నాలుగు విభాగాల్లో నామినేషన్ల ఆహ్వానం.. విజేతలకు రూ.3 లక్షల నగదు, ఏడాది పాటు ప్రత్యేక మెంటరింగ్**




**తిరుపతి, సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** గ్రామీణ భారతదేశంలో ఉపాధి, ఆదాయ కల్పన, మహిళా సాధికారత, ఆవిష్కరణలకు కృషి చేస్తున్న పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో అమర రాజా గ్రూప్ 'అమర రాజా బెటర్ వే అవార్డ్స్' నాలుగో ఎడిషన్‌ను ప్రకటించింది. గ్రామాలు, చిన్న పట్టణాల్లో సానుకూల మార్పుకు బాటలు వేస్తున్న ప్రతిభావంతులైన పారిశ్రామికవేత్తలకు గుర్తింపు, ఆర్థిక సహాయం, నిపుణుల మార్గదర్శకత్వం అందించనుంది. ఈ సందర్భంగా అమర రాజా గ్రూప్ నాయకత్వం మాట్లాడుతూ, గ్రామీణ పారిశ్రామికవేత్తలు పరిమిత వనరులతో స్థానిక సమస్యలకు వినూత్న పరిష్కారాలు చూపుతూ ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని పేర్కొంది. అలాంటి ప్రతిభను గుర్తించి, మెంటరింగ్, నైపుణ్యాభివృద్ధి, వ్యాపార విస్తరణకు అవసరమైన అవకాశాలను అందించడమే అవార్డుల ప్రధాన ఉద్దేశమని తెలిపింది. ఈ ఏడాది తొలిసారిగా 'చేంజ్‌మేకర్ ఆఫ్ టుమారో' విభాగాన్ని ప్రవేశపెట్టారు. గ్రామీణ అభివృద్ధి, సాధికారతకు ఉపయోగపడే వినూత్న, ప్రభావవంతమైన, విస్తరించదగిన ఆలోచనలు లేదా వ్యాపార నమూనాలను అభివృద్ధి చేస్తున్న గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులను ఈ విభాగంలో గుర్తించనున్నారు. అవార్డులను నాలుగు విభాగాల్లో అందించనున్నారు. మహిళల ఉపాధి, గ్రామీణ ఆదాయ కల్పన, ఉత్తమ వ్యవసాయ ఆధారిత వ్యాపారం, భవిష్యత్ మార్పుకు దారితీసే యువత విభాగాల్లో విజేతలను ఎంపిక చేస్తారు. ప్రతి విజేతకు రూ. 3 లక్షల నగదు బహుమతితో పాటు ఫైనాన్స్, మానవ వనరులు, మార్కెటింగ్, ఐటీ, సరఫరా గొలుసు వంటి రంగాల్లో ఏడాది పాటు ప్రత్యేక మెంటరింగ్ అందిస్తారు. 2023లో ప్రారంభమైన ఈ అవార్డుల ద్వారా ఇప్పటివరకు దేశవ్యాప్తంగా తొమ్మిది మంది పారిశ్రామికవేత్తలు, సంస్థలు గుర్తింపు పొందాయి. స్వతంత్ర నిపుణుల బృందం సామాజిక ప్రభావం, ఉపాధి కల్పన, వ్యాపార నమూనా, సమాజ అభివృద్ధి, విస్తరణ సామర్థ్యం వంటి అంశాల ఆధారంగా దరఖాస్తులను పరిశీలిస్తుంది. అర్హులైన అభ్యర్థులు amararaja.com/better-way-awards ద్వారా నవంబర్ 11, 2026లోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఎస్వీబీసీ అద్భుత సేవలు

**- లైవ్ ప్రసారాలతో ప్రపంచవ్యాప్తంగా భక్తులకు చేరువైన శ్రీవారి వైభవం**
**- సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు : ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ**



**తిరుపతి, సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు స్వామివారి వైభవాన్ని ప్రత్యక్ష ప్రసారాల ద్వారా చేరవేయడంలో శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్వీబీసీ) విశేష సేవలందించిందని ఛానల్ ఛైర్మన్ శ్రీధర్ వర్మ తెలిపారు. సెప్టెంబర్ 15 నుంచి 23వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొన్నారని, స్వామివారి వాహన సేవలు, విశేష అలంకారాలు, ఇతర కైంకర్యాలను ఎప్పటికప్పుడు ప్రత్యక్ష ప్రసారాల ద్వారా భక్తులకు అందించామని చెప్పారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలోని మాడవీధుల్లో, కొండపై ఎస్వీబీసీ కెమెరా సిబ్బంది, ప్రత్యక్ష ప్రసార బృందాలు, వ్యాఖ్యాతలు నిరంతరం శ్రమించి స్వామివారి కార్యక్రమాలను చిత్రీకరించి భక్తుల ముందుకు తీసుకెళ్లారని శ్రీధర్ వర్మ పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, నృత్య బృందాలు అందించిన సాంస్కృతిక కార్యక్రమాలను సైతం భక్తులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. స్వామివారి వాహన సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర విశేషాలను ఎస్వీబీసీ సామాజిక మాధ్యమాల ద్వారా చిన్న వీడియోలు, ప్రత్యేక ప్రసారాల రూపంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులకు చేరవేశామని చెప్పారు. ఈ కార్యక్రమాలన్నింటినీ ఛైర్మన్ హోదాలో దగ్గరుండి పర్యవేక్షించే అవకాశం లభించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. బ్రహ్మోత్సవాల విజయవంతమైన నిర్వహణలో సహకరించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, పాలక మండలి సభ్యులు, అధికారులు, సిబ్బందికి శ్రీధర్ వర్మ కృతజ్ఞతలు తెలిపారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు, ముద్దాడ రవిచంద్రతో పాటు వివిధ విభాగాల అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శ్రీవారి వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా భక్తులకు చేరవేసిన ముద్రణ, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్ల సేవలను అభినందించారు.

# ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడాలి - ఎన్నికల నిఘా వేదిక విజ్ఞప్తి.

**ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే ప్రాణవాయువు సామాజిక కార్యకర్త కర్లపాటి**




**జగ్గయ్యపేట సెప్టెంబర్ 25 (వార్తప్రభ)**ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణవాయువు వంటిది ఓటు హక్కని, 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హులైన పౌరుడికి రాజ్యాంగబద్ధంగా ఓటు హక్కు కల్పించడం, పారదర్శకంగా ఓటర్ల జాబితాను నిర్వహించడం ఎన్నికల కమిషన్ ప్రథమ బాధ్యతని ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర సమన్వయకర్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కేంద్ర ఎన్నికల కమిషన్‌లో జరుగుతున్న పరిణామాలు, ఓటర్ల నమోదు ప్రక్రియ మరియు జాబితా సవరణల్లో చోటుచేసుకుంటున్న సాంకేతిక, పరిపాలనాపరమైన ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన కథనాలు తీవ్రమైన చర్చకు దారితీశాయన్నారు. ప్రధానంగా ఓటర్ల నమోదు పక్రియ, ఎస్ఐఆర్ నిర్వహణ విధానంలో ఎదురవుతున్న అవరోధాలు, మరియు కమిషన్ అంతర్గతంగా సభ్యుల మధ్య వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాలు ప్రజాస్వామ్యవాదులను, సాధారణ పౌరులను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో పౌరులకు తమ ఓటు హక్కు వినియోగం పై పూర్తి నమ్మకం ఉండాలన్నారు. సాంకేతిక నిబంధనలు లేదా పరిపాలనాపరమైన ఆంక్షల వల్ల ఏ ఒక్క అర్హుడైన పౌరుడు కూడా ఓటు హక్కుకు దూరం కాకూడదని తెలిపారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ పై ప్రజల్లో ఉన్న విశ్వసనీయత దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత కమిషన్ పైనే ఉందన్నారు. పారదర్శకత -- నిష్పక్షపాత విధానం లోనే ఓటర్ల జాబితా చేర్పులు, మార్పుల ప్రక్రియ అత్యంత సులభంగా జరగాలన్నారు . నిబంధనల పేరుతో అర్హులైన కొత్త ఓటర్ల దరఖాస్తులు నిరాకరణకు గురికాకుండా చూడాలన్నారు . ఎన్నికల కమిషన్‌లోని అధికారుల మరియు సభ్యుల మధ్య పూర్తి స్థాయి సమన్వయం, పారదర్శకత ఉండాలన్నారు. అంతర్గత విభేదాలు లేదా విధానపరమైన లోపాలు ఓటర్ల హక్కులపై ప్రభావం చూపకూడదన్నారు . రాజ్యాంగం అందించిన సార్వజనీన ఓటు హక్కును కాపాడటానికి, వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడానికి తక్షణమే అవసరమైన దిద్దుబాటు చర్యలు చేపట్టాలన్నారు . ప్రజాస్వామ్య ప్రక్రియను సుసంపన్నం చేయడానికి, నిష్పక్షపాతమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ఎన్నికల కమిషన్ తక్షణమే సానుకూలంగా స్పందిస్తుందని కర్లపాటి ఆశాభావం వ్యకతం చేశారు.

# మిట్టగూడెంలో మార్మోగిన ప్రజా పోరుబాట

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి గడపకు తన్నీరు నాగేశ్వరరావు**



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 25 (వార్తప్రభ)**పట్టణంలోని 24వ వార్డు మిట్టగూడెం నందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 14వ రోజు గడపగడపకు ప్రజా పోరుబాట కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

**రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై స్థానికుల ఆవేదన** 24వ వార్డు మిట్టగూడెంలో సరైన రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు స్థానికులు తన్నీరు నాగేశ్వరరావు దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రహదారుల సమస్యతో నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడుస్తున్నా వార్డులో కనీస రహదారి సౌకర్యం కూడా కల్పించలేదని విమర్శించారు. రోడ్లు కావాలని ప్రజలు కోరుతున్నప్పటికీ కనీసం మట్టి పోసి రహదారులను సరిచేసే చర్యలు కూడా చేపట్టలేదని అన్నారు. ప్రజలు వివరించిన సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తన్నీరు నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రతి గడపను తట్టి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ కొనసాగుతున్న గడపగడపకు ప్రజా పోరుబాట కార్యక్రమానికి స్థానికుల నుంచి స్పందన లభించింది. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్, వార్డు అధ్యక్షుడు గుంజ రోశయ్య, కుంభ గోపి, కాకాని అఖిల్, గుంజ వాసు, రామిని ఉపేందర్ రెడ్డి, దార్ల ప్రసన్నకుమార్, సయ్యద్ ఫయాజ్, గుంజ ఏడుకొండలు, దేవరశెట్టి వీరాంజనేయులు, జక్కులూరి సురేష్, చెవుల చిన్నికృష్ణ, చెరుకు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ నియోజకవర్గం లో 28 డివిజన్లలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జ్ బుద్ధా వెంకన్న**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 25 :(వార్త ప్రభ ప్రతినిధి)** పశ్చిమ నియోజకవర్గంలోని మల్లికార్జునపేటలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఈరోజు నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ధా వెంకన్న పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 28 డివిజన్లలో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి డివిజన్‌లో కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తను గుర్తించి గౌరవించుకోవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని బుద్ధా వెంకన్న తెలిపారు. కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.

## అంగన్ వాడీ ఉత్సవాలు ప్రారంభం



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25 (వార్తా ప్రభ ప్రతినిధి):** స్థానిక ఫెర్రీ అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం అంగన్ వాడీ ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాధవి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో భాగంగా ప్రతి అంగన్వాడీ కేంద్రంలో మూడు రోజులపాటు లబ్ధిదారులు హాజరయ్యే విధంగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ మూడు రోజుల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరించి పిల్లలకు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లను సన్మానిస్తున్నట్లు చెప్పారు. దుర్గా కాలనీ అంగన్ వాడీ కేంద్రంలో కార్యకర్త, హెల్పర్ ను బిజెపి పట్టణ అధ్యక్షురాలు మాధురి సన్మానించారు. ఇబ్రహీంపట్నం ముస్లిం ఏరియా, దుర్గా కాలనీ ప్రేమ ధార, కె.మూలపాడు, పి.మూలపాడు, కిలేశపురం 1, 2, 3, కొండపల్లి వీవీఎం నగర్, బీసీ కాలనీలో అంగన్వాడీ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ శివకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి

**కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు**
**భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 25(వార్తా ప్రభ ప్రతినిధి):** గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించారు కొండపల్లి మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు. కాల్వలో చెత్త చెదారం పేరుకుపోవడం వలన వరద నీరు రోడ్డుపైకి చేరుకోవటంతో వెంటనే స్పందించి జెసిపి సహాయంతో కాలువలలోని చెత్తను తొలగించేందుకు మున్సిపాలిటీ సిబ్బందిని రంగాల్లోకి దించారు. స్వయంగా ఛైర్మన్ చిట్టిబాబు దగ్గరుండి పరిష్కరించారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాలలో రెండు అడుగుల మేర వర్షపు నీరు నిలిచిపోవడంతో

**200 మీటర్లు పైపులైన్ పనులు ముమ్మరం** ఇబ్రహీంపట్నం మండలం రైతు బజార్ సమీపంలో 2002 మీటర్ల పైపులైన్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి .13 కౌన్సిలర్ నారాయణ సమక్షంలో ఈ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం మూడు 4 వార్డులకు గాను మంచినీరు అందించేందుకు ఛైర్మన్ చిట్టిబాబు అత్యవసర పనుల నిమిత్తం 5 లక్షల రూపాయలను కేటాయించినట్లు కౌన్సిలర్ నారాయణ తెలిపారు. మరో రెండు రోజుల్లో ఈ పనులు పూర్తి చేసి స్థానిక ప్రజలకు మంచినీళ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ చిట్టిబాబు తో పాటు కౌన్సిలర్ నారాయణ, గోపాల్ రావు, కొండపల్లి 15వ వార్డు టిడిపి డివిజన్ అధ్యక్షులు ఇర్ల దుర్గారావు పాల్గొన్నారు.

## నివాస గృహాల మధ్య కలుపు మొక్కలు

**ఖాళీ స్థలాలలో పెరుగుతున్న మరుగు**
**పట్టించుకోని మున్సిపల్ అధికారులు**



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 25 (వార్తప్రభ)**పట్టణంలోని సీతారాంపురం నాలుగో వార్డులో ఖాళీ స్థలాల్లో కలుపు మొక్కలు మనిషి ఎత్తున ఏపుగా పెరిగి ఆ ప్రాంత ప్రజలకు ఇబ్బందిగా మారాయి. పెద్ద ఎత్తున పెరిగిన కలుపు మొక్కల వలన పందికొక్కులు, ఎలుకలతో పాటు విషపూరితమైన పాములు వంటివి చేరే అవకాశం ఉందని ఆ ప్రాంత వాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ స్థలాలలో పెద్ద ఎత్తున కలుపు మొక్కలలో కుక్కలు పిల్లలను పెడుతున్నాయి. స్థల యజమానులు ఆ ప్రాంతాలను పట్టించుకోకపోవడంతో అక్కడి నివాసితులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి అడవిలాగా మొక్కలు పెరిగి కనబడుతున్న మున్సిపల్ అధికారులకు కనబడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు వార్డు పర్యటన చేసిన సమయంలో సమస్యను స్థానికులు వారి దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ ప్రయోజనం కలగలేదు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కలుపు మొక్కల నుండి దుర్గంధం వెలువడుతుంది. ఖాళీ స్థలాలలో పెద్ద ఎత్తున ఏపుగా మొక్కలు పెరగటం వలన దోమల బాధ కూడా ఎక్కువైంది. గత ఏడాది సైతం ఇదే రకమైన వాతావరణంలో ఆ ప్రాంతం మొత్తం చిట్టడివిని తలపించటం పై వార్తాపత్రికలలో కథనాలు రావడంతో ఆ సమయంలో మున్సిపల్ అధికారులు స్పందించి ఖాళీ స్థల యజమాని ద్వారా శుభ్రపరిచే ఏర్పాటు చేశారు. తిరిగి అదే రకమైన అపరిశుభ్రమైన వాతావరణం ఏర్పడటంపై పరిసర ప్రాంతాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

# ముంపు వీడని ధనియాలపేట న్యూ కాలనీ !

-ఎమ్మెల్యే రాము స్పందించాలని వేడుకోలు..



**గుడివాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** నిన్న కురిసిన భారీ వర్షానికి ధనియాలపేట న్యూ కాలనీ జలమయమైంది. ఇళ్లలోకి నీరు చేరి, బయటకు వెళ్లే మార్గం లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు కాల్వలు పూడుకుపోవడంతో వర్షపు నీరు నిలిచిపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా కాలనీలోని నాయకులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే రాము వెంటనే స్పందించి, నీటి నిల్వకు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ పై వైసీపీ విమర్శలను ఖండించిన మండల టిడిపి నాయకులు

**పెడన,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పై వైసీపీ నాయకులు పేర్ని నాని ఉప్పాల రాము లు చేసిన విమర్శలను మండల టిడిపి నాయకులు గురువారంనాడు స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఖండించారు. మాజీ జెడ్పిటిసి అర్జా నగేష్ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్ ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాదులు మాట్లాడుతూ కాగిత కుటుంబాన్ని విమర్శించే ముందు ఉప్పాల రాము వారి గత చరిత్రను తెలుసుకోవాలన్నారు. ఉప్పాల కుటుంబం ఆర్థికంగా ఈరోజు బలపడిందంటే అందుకు కారణం కాగిత కుటుంబం కాదా అని ప్రశ్నించారు. నీతి నియమాలకు పెట్టింది పేరైన కాగిత కృష్ణ ప్రసాద్ ను వేలెత్తి చూపించే అర్హత పేర్ని నాని కి గాని ఉప్పాల రాముకి గానీ లేదన్నారు. వ్యక్తిగత విమర్శలు చేసే 151 సీట్లను 11 సీట్లకు తగ్గించుకున్నారని అన్నారు. అయినా వీరి ప్రవర్తనలో మార్పు రావడంలేదని విమర్శించారు. గతంలో శాసనసభ్యులు చేసిన బూరగడ్డ గడ్డ వేదవ్యాస్ కాగిత వెంకటరావులు ఏనాడు వ్యక్తిగత విమర్శలు చేసుకోలేదన్నారు. పెడన మండలంలో 200 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. గతవైసీపీ ప్రభుత్వం లో జోగి రమేష్ ఇక్కడ ఉన్నపుడు నియోజకవర్గం లో జడ్పీ నిధులతో అభివృద్ధి ఎందుకు చేయలేదని మీరు ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి పెడన వచ్చినప్పుడు మీరు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చెత్త టాక్టర్లతో తరలించినప్పుడు ఏం



చేశారని ప్రశ్నించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే వీరు ఈ తరహా విమర్శలకు దిగుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో చేవెంద్ర కొంకేపూడి నందిగామ పిఎసిఎస్ అధ్యక్షులు అంకెం పమిడేశ్వరావు రావు కట్టా నాగరాజు యరగని నాగరాజు పార్టీ నాయకులు కట్టా సతీష్ పరసా కామేశ్వరరావు పర్సా చిన్నా శొంఠి రాము కన్నెపోటి సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి-కలెక్టర్ బాలాజీ



**గుడివాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. గుడివాడలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి 'మీకోసం' కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వచ్చే మూడు శుక్రవారాలు కూడా ఇదే తరహా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జి. బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్, డీఎస్పీ పి శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్మార్ట్ ఇండియా హ్యాక్థాన్ 2026 లో గుడివాడ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ..!



**గుడివాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2026కు సంబంధించిన అంతర్గత హ్యాకథాన్‌ను నిర్వహించారు. దీనిలో కళాశాలకు చెందిన 25 విద్యార్థి బృందాలు పాల్గొని తమ వినూత్న ఆలోచనలు, సాంకేతిక పరిష్కారాలను ప్రదర్శించాయి. కార్యక్రమ ప్రారంభోత్సవంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. హెచ్. వి. ప్రసాదరావు, హ్యాకథాన్ కోఆర్డినేటర్ డా. ఎన్. ధనుంజయరావు, కన్వీనర్ జి. హనుమ నరేంద్ర, కళాశాల SIH SPOC డా. జి. వెంకట రత్నం లు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. హ్యాకథాన్‌లో పాల్గొన్న 25 బృందాలు తమ ప్రాజెక్ట్ ఆలోచనలు, పరిష్కార నమూనాలు మరియు సాంకేతిక ప్రతిపాదనలను ప్రదర్శించాయి. కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ వేములపల్లి కోదండ రామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్ కుమార్ లు హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. అంతర్గత హ్యాకథాన్‌లో ప్రతిభ కనబరిచిన బృందాలను తదుపరి దశకు ఎంపిక చేసి, స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2026 లో తమ కళాశాల తరపున పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

# సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలి వ్యాయామం చేయాలి - డాక్టర్ చప్పిడి



**కాకినాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** ప్రతి ఒక్కరూ సి పి ఆర్ పై అవగాహన కలిగి ఉండాలని, వ్యాయామం తప్పని సరిగా చేయాలని అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ సహ కోసాధికారి రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు అలై మంజుల ఆధ్వర్యంలో ఉచిత సిపిఆర్ అవగాహన సదస్సు, ఉచిత మధుమేహ పరీక్షలు నిర్వహించారు. ఈ సిపిఆర్ అనేది కార్డియో పల్మనరి రెసిస్ స్టేషన్ అని అంటారని, అయితే ముఖ్యంగా ఏదైనా ఎక్కడైనా మనిషి స్పృహ కోల్పోయినప్పుడు ఊపిరి ఆడకపోయినప్పుడు అటువంటి పరిస్థితుల్లో మనం ఈ ఛాతి పై భాగంలో అదుముతూ ఒక 20 నిమిషాలు నుండి 25 నిమిషాల పాటు ఈ ప్రక్రియ కొనసాగిస్తూ మధ్య మధ్యలో నోటితో ఊపిరిని అందించే ప్రక్రియను సి పి ఆర్ అంటారు. అలాగే వెంటనే ఈ ప్రక్రియ మొదలుపెట్టే ముందే మనం 108కి ఎమర్జెన్సీ అంబులెన్స్ సర్వీసెస్ కి ఫోన్ చేసి చెప్పాలని, ఈ విధంగా చేయడం వల్ల పదిమందిలో కనీసం ఒకటి ,రెండు ప్రాణాలైనా మనం కాపాడు కలిగిన వారు అవుతామని , అందుచేత ప్రతి ఒక్కరు సిపిఆర్ పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రతి ఒక్కరికి తెలియటం వల్ల దారిలో ప్రమాదాలు జరిగితే అక్కడ నిష్ణాతులు ఎవరు కూడా ఉండరు కాబట్టి ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన ఉంటే మనం తోటి వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన వారము అవుతామని డాక్టర్ వెంకటేశ్వరరావు చెప్పారు. అలాగే సుమారు 45 మందికి ఉచితంగా మధుమేహ పరీక్షలు చేసారు. కార్యక్రమంలో అధ్యక్షులు మంజుల,వరలక్ష్మి, నాగమణి, సుమంత్ ,క్లబ్ కోశాధికారి కొత్త శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణులకు తొలుత గుర్తొచ్చేది ఆర్ఎంపీ వైద్యుడే

-చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య




**ఒంగోలు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యానికి గురైతే తొలుత గుర్తుకు వచ్చేది ఆర్ఎంపీ వైద్యుడేనని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. అనుభవ సంఘాల సమాఖ్య, ఏపీ ఆర్ఎంపీ, పీఎంపీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని బృందావన్ కళ్యాణ మండపంలో శుక్రవారం రాష్ట్ర మహాసభ జరిగింది. ఫెడరేషన్ అధ్యక్షులు యామర్తి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ, తాను కనిగిరిలో నిర్వహించిన మెడికల్ క్యాంపుకు 15 వేల మంది రావడానికి కారణం ఆర్ఎంపీ వైద్యుల సహకారమేనన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో తమ సమస్యలపై గళం వినిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సలహాదారు లంకదాసరి ప్రసాదరావు, గౌరవ అధ్యక్షులు కోలా వెంకటేశ్వరరావు, సిఎస్ కుమార్, కాటూరి వరప్రసాద్, కరేళ్ల గణపతిరావు, ముక్తశ్వరరావు, దాసు వెంకట నాగేశ్వరరావు, పసుపులేటి వెంకటేశ్వరరావు, డివిఎస్ రాజు, గళ్ళా మురళి తదితరులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 2,200 మంది ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ పాత్ర చాలా కీలకం




**గుంటూరు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** స్థానిక టి జె పి యస్ కళాశాలలో ఈరోజు జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని కళాశాల జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వర శాస్త్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గారు మాట్లాడుతూ విద్యార్థి దశలో తప్పనిసరిగా ఏదో ఒక ప్రత్యేకమైన విభాగంలో ప్రవేశించాలని, విద్యతోపాటు సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకునే సువర్ణమైన అవకాశం జాతీయ సేవా పథకం ద్వారా తప్పనిసరిగా వస్తుందని పేర్కొన్నారు. ఈ పథకంలో ప్రవేశించడం వలన విద్యార్థికి నాయకత్వ లక్షణాలతో పాటు సమాజంలో విభిన్న మనస్తత్వాలు కలిగిన మనుషుల యొక్క భావాలు కూడా గ్రహించవచ్చని, సమాజంతో మమేకమయ్యేటువంటి అవకాశాలు ఇచ్చేటువంటి పథకం జాతీయ సేవా పథకం అని చెప్పారు. గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారి డాక్టర్ జమ్ము వెంకట సుధీర్ కుమార్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా రక్తదాన శిబిరాలు నిర్వహించడం, మొక్కలు నాటి సంరక్షించడం, ఉచిత వైద్య శిబిరాలు గ్రామాల్లో, వివిధ కాలనీలో ఏర్పాటు చేయడం.ఆరోగ్యం అవగాహన గురించి ప్రజలకు తెలియజేయడం. ప్రజలకు హాని కలిగించేటువంటి వాటి గురించి అవగాహన కలిగించడం,ప్రకృతి సంరక్షణలో పాలుపంచుకోవడం, ప్రేరణాత్మక తరగతులు నిర్వహించడం, అనాథ ఆశ్రమాలను సందర్శించి, వారి కష్టసుఖాలను తెలుసుకొని తగినంత సహాయం చేయడం వంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుందని, మానవసేవే మాధవసేవ అనే నినాదాన్ని ప్రతి ఒక్క వాలంటీర్ బాధ్యతగా తీసుకుని దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల ఇంటర్, డిగ్రీ,పీజీ విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వం పోటీలు నిర్వహించడం జరిగింది. పోటీలో విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు ఇవ్వబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆర్ జయ శైలజ ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం అధికారి, కళాశాల ఇంటర్మీడియట్ ఇంచార్జ్ జి సురేష్ కుమార్, వాణిజ్య శాస్త్ర అధ్యాపకురాలు వర లక్ష్మి మరియు జాతీయ సేవా పథకం వాలంటరీలు పాల్గొన్నారు.

# వావిలాల సేవలు యువతకు ఆదర్శం -కోగంటి గాంధీబాబు



**గుడివాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** స్వాతంత్ర్య సమరయోధుడు, అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడు వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. తెలుగు భాష వికాస సమితి ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయపేటలోని సుందరయ్య భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఎన్ఆర్ కళాశాల విశ్రాంత చరిత్ర శాఖాధిపతి కోగంటి గాంధీబాబు మాట్లాడుతూ ఆంధ్రదేశ చరిత్రలో వావిలాల వంటి నీతి, నిజాయితీ గల నిస్వార్థ ప్రజాసేవకులు అరుదని కొనియాడారు. వారి సేవలు నేటి యువతకు ఆదర్శమన్నారు. అనంతరం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కొర్రాళ్ళ భుజంగభూషణరావు కుమారుడు కొర్రాళ్ళ భవకు వావిలాల సాహితీ స్ఫూర్తి పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు వీర రాఘవాచారి, ఎంవీజీ ఆంజనేయులు, బండారు రాధాకృష్ణ, సయ్యద్ గఫార్, మోకా మాధవరావు, చింతలూరి సత్యనారాయణ, నరహరి శెట్టి ప్రసాద్, మట్ట రాజా, పివి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు వీఆర్ఏల వినతులు!



**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** మండలంలోని గ్రామ రెవిన్యూ సహాయకులు గుడ్లవల్లేరు బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయం ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు తమ కోర్కెలకు సంబంధించిన వినతి పత్రాలను శుక్రవారం అందించారు. తమగోడును పట్టించుకోని ప్రభుత్వానికి ఈ విధంగా వీఆర్ఏలు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు ఉడుముల రవికుమార్, ఆ సంఘ నాయకులు చార్లెస్, కిరణ్, ఫైజుల్లా, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

● రెడ్‌క్రాస్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. సమరం ● లోయోలా కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం






**విజయవాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** అత్యవసర పరిస్థితుల్లో విలువైన ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరికీ ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహనతో పాటు ఆచరణాత్మక శిక్షణ అవసరమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి. సమరం అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విజయవాడ లోయోలా కళాశాల విద్యార్థులకు ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సమరం మాట్లాడారు. ప్రమాదాలు, గాయాలు, అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం, గుండె ఆగిపోవడం, శ్వాస నిలిచిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది చేరుకునే లోపు బాధితులకు అందించే ప్రథమ చికిత్స అత్యంత కీలకమని ఆయన తెలిపారు. ముఖ్యంగా గుండె ఆగిపోయిన వ్యక్తికి సకాలంలో సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని వివరించారు. విద్యార్థులు ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై కేవలం విషయ పరిజ్ఞానంతో సరిపెట్టుకోకుండా ఆచరణాత్మక శిక్షణ పొందాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు భయాందోళనకు గురికాకుండా బాధితులకు సురక్షితంగా, బాధ్యతాయుతంగా ప్రాథమిక సహాయం అందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. మానవతా సేవల్లో భాగంగా ప్రాణరక్షణ నైపుణ్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రెడ్‌క్రాస్ ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని డాక్టర్ సమరం తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇతరులకు తెలియజేసి ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై సమాజంలో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 120 మంది విద్యార్థులు పాల్గొని ప్రథమ చికిత్స, సీపీఆర్‌కు సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే ధైర్యం, బాధ్యతాయుతమైన వైఖరి, మానవతా సేవాభావాన్ని విద్యార్థుల్లో పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా శాఖను కళాశాల యాజమాన్యం అభినందించింది.

# వైఎస్సార్ సీపీ నేత దుగ్గిరాలకు పితృ వియోగం...



**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** మండలంలోని అంగలూరు వైఎస్సార్ సీపీ నేత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దుగ్గిరాల శేషుబాబుకు పితృ వియోగం ఏర్పడింది. శుక్రవారం శేషుబాబు తండ్రి దుగ్గిరాల రాధాకష్ణ మోహన్(86) మతి చెందారు. ఏసీఎస్ చైర్మన్‌గా, గ్రామ ఉప సర్పంచిగా రాధాకష్ణ మోహన్‌కు పని అనుభవం ఉంది. ఆయన భౌతికఖాయాన్ని సందర్శించిన ప్రముఖులు నివాళులర్పించి...శేషుబాబు కుటుంబాన్ని పరామర్శించారు. శనివారం తన తండ్రి భౌతికఖాయానికి శనివారం అంతిమ సంస్కారాలు జరుగనున్నట్లు శేషుబాబు పేర్కొన్నారు.

# స్కిల్ డెవలప్‌మెంట్‌పై తల్లులకు అవగాహన



**గుడివాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** అంగన్‌వాడీ ఉత్సవంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సేవా సంకల్ప అభియాన్ 25 సం॥ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని గుడివాడ -2 సెక్టార్ నందు ఎన్టీఆర్ కాలనీ -1 అంగన్‌వాడీ సెంటర్ నందు అంగన్‌వాడీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ అధికారిణి సిడిపిఓ మేడమ్ కాంత కుమారి, జయంతి లు మాట్లాడుతూ గర్భవతులకు బాలింతలకు అంగన్‌వాడీ లో ఇచ్చేటువంటి పోషకాహార విలువల గురించి, గృహ సందర్శనల గురించి, ప్రీ -స్కూల్ ఎడ్యుకేషన్ ఈ కార్యక్రమం 3రోజులు జరుగుతుందని 3 నుండి 6 పిల్లల పోషకాహారం గురించి అలాగే ప్రీ స్కూల్ గురించి ఆ ప్రాంతంలోని తల్లుకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సూపర్‌వైజర్లు భవాని, శిరీషా, ఆరిఫా లు, అంగన్ వాడీ టీచర్లు ఆసియా, అప్పాయమ్మ లు ఆయాలు పావని, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు పట్టాభిషేకాన్ని సద్వినియోగం చేసుకోండి

● అర్హులు స్వర్ణ గ్రామం, వార్డు కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకోండి ● తహాశీల్దార్ కార్యాలయాల్లోనూ పేర్ల నమోదుకు వీలు ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** జిల్లాలో గతంలో ప్రభుత్వం మంజూరుచేసిన నివేశన స్థల పట్టాలకు అమ్మకపు హక్కుతో కూడిన రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించేందుకు, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో గృహ నిర్మాణం చేసుకొని నివసిస్తున్న అర్హులైన ఆక్రమణదారుల ఆక్రమణల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం కార్యక్రమాన్ని అమలుచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. అర్హులైన వారు తమ సమీప స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలను లేదా సంబంధిత తహాశీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి, తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి వారిచే ఈ నెల 30వ తేదీన విజయవాడలో జరిగే పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో అర్హులైన వారందరూ భాగస్వాములు కావాలని.. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం, ఇతర ప్రయోజనాలు పొందాల్సిందిగా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు.

# ఘనంగా ఫార్మసిస్ట్ దినోత్సవ వేడుకలు...



**గుడ్లవల్లేరు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో ఫార్మశీ అధ్యాపకులు పలువురిని లయన్స్ ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ చైర్మన్ కల్యాణపు నవాబు, లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, టీడీపీ మండలాధ్యక్షులు పోలవరపు వెంకట్రావు, లయన్స్ ప్రతినిధులు పరంధామయ్య, చిట్టిబాబు, కొండయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం

● రూ.1.45 కోట్లతో రహదారి, డ్రైనేజీ పనులకు శ్రీకారం

● నిర్ణీత గడువులో నాణ్యతతో పనులు పూర్తి చేయాలి: మంత్రి కొలుసు పార్థసారథి





**ఆగిరిపల్లి,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** పట్టణాలకు ధీటుగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలంలో శుక్రవారం రూ.1.45 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఆగిరిపల్లి--విజయవాడ ప్రధాన రహదారి నుంచి గొండపల్లి వరకు 2 కిలోమీటర్ల మేర రూ.95 లక్షలతో నిర్మించనున్న ఆర్అండ్బీ బీటీ రహదారి పనులతో పాటు, ఆగిరిపల్లి గ్రామంలోని యాదవుల మండపం నుంచి మెట్లకోనేరు వరకు రూ.50 లక్షల ఎంపీ ల్యాండ్స్ నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా రహదారులను ఆధునీకరిస్తున్నామని, గ్రామాల్లో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థతో పారిశుధ్యం, ప్రజారోగ్యం మెరుగుపడతాయని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గ్రామ ప్రజలను పేరుపేరునా పలకరిస్తూ వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు, మహిళలు మంత్రికి ఘన స్వాగతం పలికారు. నూజివీడు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# ఆలోచనలకు రెక్కలు.. ప్రతిభకు అవకాశాలు

● సృజనాత్మక ఆర్థిక రంగంలో విస్తృత అవకాశాలు ● డిజిటల్ సాంకేతికత, ఏఐతో ప్రతిభకు పట్టం

● అమరావతిలో క్రియేటివ్ ఇండస్ట్రీకి కొత్త ఊపు ● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి





**విజయవాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** సృజనాత్మకత, ప్రతిభ, సాంకేతికత కలయికతో యువతకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. సృజనాత్మక ఆర్థిక రంగం (క్రియేటివ్ ఎకానమీ) వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కళలు, డిజైన్, చలనచిత్రం, సంగీతం, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, ప్రకటనలు, ఫ్యాషన్ తదితర రంగాల్లో ప్రతిభావంతులకు అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. శుక్రవారం మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్)లో ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిల్మ్ ఆర్క్ సంయుక్త ఆధ్వర్యంలో అమరావతి క్రియేటివ్ ఎకానమీపై వర్క్ షాప్ జరిగింది. ఈ వర్క్ షాప్ ను ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్వి పొడపాటి ఉదయం ప్రారంభించగా.. సాయంత్రం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి దాదాపు 300 మంది యువతీయువకులు హాజరయ్యారు. మంత్రివర్యులు కందుల దుర్గేష్ సహాయ సహకారాలతో జరిగిన కార్యక్రమంలో కథా రచన, దర్శకత్వం, నిర్మాణం, ఎడిటింగ్, దృశ్య వీఎఫ్ఎక్స్, యానిమేషన్ వంటి విభాగాలపై అవగాహన కల్పించారు. స్థానికంగానే సృజనాత్మక యువతకు మంచి అవకాశాలు లభించేలా జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిల్మ్ ఆర్క్ బృంద సభ్యులు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా తేజస్వి పొడపాటి మాట్లాడుతూ ప్రతిభావంతులైన సినీ దర్శకులు, కంటెంట్ సృష్టికర్తలు, యానిమేటర్లు, వీఎఫ్ఎక్స్ కళాకారులు, కథకులు, సృజనాత్మక ఆవిష్కర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ కార్యక్రమాన్ని చూడటం ఎంతో స్ఫూర్తిని చ్చిందన్నారు. అమరావతిలో సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహించడంతో పాటు, సృజనాత్మక రంగంలోని ప్రతిభావంతులకు కొత్త అవకాశాలను కల్పించే ఈ ముఖ్యమైన కార్యక్రమంలో భాగస్వామిగా ఉండటం నాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికతతో పాటు కృత్రిమ మేధస్సు (ఏఐ) అందుబాటులోకి రావడంతో సృజనాత్మక రంగంలో పనిచేసే వారికి కొత్త మార్గాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. యువత తమలోని సృజనాత్మకతను సాంకేతిక నైపుణ్యాలతో అనుసంధానం చేసుకుని ప్రపంచ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆలోచనలను ఉత్పత్తులు, సేవలు, వ్యాపార అవకాశాలుగా మలుచుకునేలా అవసరమైన నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, మార్గదర్శకత్వం అందించడం ద్వారా యువతకు మరింత చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతి రాజధాని ప్రాంతం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సృజనాత్మక పరిశ్రమలకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడుతోందని పేర్కొన్నారు. సాంకేతికత, మౌలిక వసతులు, యువ ప్రతిభ, పెట్టుబడులు ఒకే వేదికపైకి వస్తే క్రియేటివ్ ఇండస్ట్రీ మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. స్థానిక ప్రతిభకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంచేందుకు సృజనాత్మక రంగం కీలకంగా నిలుస్తుందని.. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందని కలెక్టర్ తెలిపారు. ఆరెంజ్ ఎకానమీ విస్తరణతో సరికొత్త అవకాశాలు అందిపుచ్చుకునేలా చూస్తోందన్నారు. కార్యక్రమంలో జాడెక్స్ ఇన్నోవిజన్ బృంద సభ్యులు దివ్య కొనకళ్ల, రాఘవ చైతన్య, పి.శశి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక అధికారులు గ్రామాల అభివృద్ధికి బాధ్యతగా పని చేయాలి

● గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి. ● అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్.





**అవనిగడ్డ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** ప్రత్యేక అధికారులు గ్రామాల అభివృద్ధికి బాధ్యతగా పని చేయాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్పష్టం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం అవనిగడ్డ రెవిన్యూ భవనంలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల పరిషత్, గ్రామ పంచాయతీ పాలకవర్గముల గడువు ముగియటంతో ప్రత్యేక అధికారులుగా నియమితులు అయిన అధికారులు గ్రామాల పరిస్థితిని పరిశీలించి ప్రణాళికతో పని చేయాలని సూచించారు. ప్రధానంగా పారిశుధ్యం, త్రాగునీరు, స్ట్రీట్ లైట్లు, డ్రైనేజీ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేయాలని సూచించారు. ప్రజల సమస్యలు, గ్రామ అవసరాలు గుర్తించి పరిష్కారం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే వరకూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రజా ఉపయోగ కార్యక్రమాలు బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులతో చేపట్టే అభివృద్ధి పనులన్నీ నాణ్యతా ప్రమాణాలతో జరిగేలా శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది బాధ్యత, క్రమశిక్షణ, సమయపాలనతో పని చేయాలని సూచించారు. ఇటీవల తాను నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గ్రామ కార్యదర్శులు కొందరు హాజరు పట్టిలో సంతకాలు కూడా చేయకపోవటం, కొందరు సిబ్బంది కార్యాలయాల్లో అందుబాటులో ఉండకపోవటం గమనించినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది తమ కార్యాలయాల్లో రైతులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు ప్రజల ప్రశంసలు అందుకునేలా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు నియోజకవర్గంలోని అధికారులతో అంశాలవారీగా చర్చించారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఖచ్చితంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయ కార్యాలయాలపై నియమితులు అయిన డిప్యూటీ ఎంపీడీఓలు ఈ అంశంపై ఎందుకు బాధ్యత వహించటం లేదని ప్రశ్నించారు. హాజరు రిజిస్టర్, మూవ్మెంట్ రిజిస్టర్, జాబ్ చార్ట్ సక్రమంగా నిర్వహిస్తున్నారా అని ప్రశ్నించారు. ఆకస్మిక తనిఖీలో సిబ్బంది నిర్లక్ష్యం బయటపడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. 22ఏ పరిష్కారం కోరుతూ రైతులు సమర్పించిన దరఖాస్తుల పరిష్కారం, పింఛన్ దరఖాస్తుల ప్రక్రియ, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ తదితర అంశాలను చర్చించారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 38మద్యం షాపుల నిర్వహణకు గెజిట్ విడుదల : ఎక్సైజ్ డీసీ కృష్ణ కుమారి



**కాకినాడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** 2026-27 సంవత్సరం మద్యం షాపుల నిర్వహణకు గాను కాకినాడ జిల్లాలో గల ఏడు ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 171 మద్యం షాపులకు గాను 133 షాపులు రెన్యువల్ చేయగా మిగిలిన 38 మద్యం షాపులు నిర్వహించుకొనుటకు కాకినాడ జిల్లా కలెక్టర్ గెజిట్ 52ను విడుదల చేశారని ప్రోహిబిషన్, ఎక్సైజ్ కాకినాడ జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి తెలియజేశారు. తాళ్ళరేవు స్టేషన్ పరిధిలో 4షాపులు, కాకినాడ సౌత్ స్టేషన్ పరిధిలో 4షాపులు, కాకినాడ నార్త్ స్టేషన్ పరిధిలో 8షాపులు, పెద్దాపురం స్టేషన్ పరిధిలో 7షాపులు, పెద్దాపురం స్టేషన్ పరిధిలో 8షాపులు, ప్రత్తిపాడు స్టేషన్ పరిధిలో రెండు షాపులు,తుని స్టేషన్ పరిధిలో 5షాపులపై ఆసక్తి గల వారి నుండి దరఖాస్తులు కోరుచున్నామని తెలిపారు. మూడు లక్షల రూపాయలు నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫీజును వెయ్యి రూపాయలు నాన్ రిఫండబుల్ ప్రాసెసింగ్ ఫీజును చలానాల రూపంలో కానీ డిమాండు డ్రాఫ్ట్ రూపంలో కానీ కట్టి ఆన్లైన్ ద్వారా ఆఫ్ లైన్ ద్వారా కానీ హైబ్రిడ్జ్ పద్ధతిలో కానీ దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను అక్టోబర్ ఒకటవ తేదీన రాత్రి 12గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇతర సమాచారం కోసం గెజిట్ నెంబర్ 52 ప్రచురించిన గెజిట్ ను అన్ని ప్రోహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్లో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏసీ.రామ్మోహన్, సీఐ మహ్మద్ ఆలీ, ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై వి.రామకృష్ణ,కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

# పిఐబి విజయవాడ ఆధ్వర్యంలో 'వార్తాలాప్' - మీడియా అవగాహన సదస్సు

● ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మీడియా వారధిలా కీలక పాత్ర పోషిస్తుంది: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి సందేశం






**శ్రీకాకుళం,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం (పిఐబి) విజయవాడ ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ జి. సురేష్ కుమార్ (ఐఐఎస్) నేడు శ్రీకాకుళంలో జిల్లా మరియు గ్రామీణ విలేకరుల కోసం ఒక రోజు 'పిఐబి వర్తాలాప్' మీడియా అవగాహన సదస్సును ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంతో పాటు, అభివృద్ధి సంబంధిత జర్నలిజం, విజయగాథల కవరేజ్, సోషల్ మీడియా మెళకువలు, నకిలీ సమాచారాన్ని నిరోధించడం మరియు పత్రికా సమాచార కార్యాలయ పనితీరుపై అవగాహన కల్పించేందుకు విజయవాడ పిఐబి ప్రాంతీయ కార్యాలయం ఈ కార్యశాలను నిర్వహించింది. జర్నలిస్టులను ఉద్దేశించి సురేష్ కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు మరియు వివిధ కార్యక్రమాలపై నిజమైన, సమయానుకూల సమాచారాన్ని అందిస్తూ ప్రభుత్వం, మీడియా మధ్య పిఐబి కీలక వారధిగా వ్యవహరిస్తుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు వివిధ ప్రతిష్టాత్మక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై మీడియాకు విస్తృత అవగాహన కల్పించడంలో సహాయపడతాయని పేర్కొన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రత్యేక సందేశం పంపించారు. ఇందులో.. పిఎం ముద్రా యోజన, స్టార్టప్ ఇండియా, పిఎం విశ్వకర్మ, స్కిల్ ఇండియా, పిఎమ్ఇజిపి మరియు పిఎంకెవివై వంటి యువత కోసం ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను గుర్తించి ప్రస్తావించారు. యువత ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగేలా అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ప్రజల సంక్షేమానికే భారత ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని పునరుద్ఘాటించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల ఫలాలను ప్రజలకు చేరవేసేలా మీడియా విస్తృత అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మౌలిక సదుపాయాలు, జీవన ప్రమాణాల మెరుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా కేంద్ర మంత్రి వివరించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ రెడ్డి తిరుపతి రావు మాట్లాడుతూ, గ్రామీణ సమస్యలు, గ్రామీణ ప్రజల ఆందోళనలపై ఎక్కువ దృష్టి సారిస్తూ 'డెవలప్మెంటల్ జర్నలిజం' (అభివృద్ధి జర్నలిజం) చేయాల్సిన ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. విలేకరులు గొంతు లేని వారి గొంతుకని, గ్రామీణ సమస్యలను వెలుగులోకి తెచ్చి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో తోడ్పడగలరని అన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడటానికి వాటిపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. పథకాల ప్రయోజనాల్ని, లబ్ధిదారుల జీవితాలు ఎలా మారుతున్నాయో తెలిపే కథనాలు రాయాలని, అదే సమయంలో పథకాల సమర్థవంతమైన అమలు కోసం నిర్మాణాత్మక విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్డిఎమ్) శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఉద్యోగాలు కల్పించే వారిగా మారేందుకు బ్యాంకింగ్ వ్యవస్థ ఎలా తోడ్పడుతుందో వివరించారు. కేంద్ర సాయంతో నడిచే పథకాలు మరియు బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని మీడియాను కోరారు. సమాచార, పౌరసంబంధాల శాఖ డిఐపిఆర్ చెన్నకేశవరావు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కె.వి. రమణ మరియు వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల సీనియర్ అధికారులు కూడా ఈ కార్యశాలలో ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై విలేకరులు తమ అభిప్రాయాలను పంచుకున్న ఇంటరాక్టివ్ సెషన్తో ఈ అవగాహన సదస్సు ముగిసింది.

# పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టాలి..

● బీసీలకు ఎన్నికల్లో అధిక శాతం సీట్లు కేటాయించాలి

● కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బీసీ నేత భేరి రామచందర్ యాదవ్




**హైదరాబాద్,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** తరతరాలుగా బీసీలకు అన్యాయం జరుగుతుందని బీసీలు హక్కులను అమలు పరచడం లేదని బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా వారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టి బీసీలకు అధిక శాతం రాబోవు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర మంత్రులు కేంద్ర మంత్రులు ముందుకు రావాలని బీసీల పట్ల నిబద్ధత చూపించాలని బీసీలకు జరుగుతున్న అన్యాయాలకు న్యాయం చేయాలని అన్నారు. దేశంలో అధిక శాతం బీసీ జనాభా ఉన్నందున బీసీలకు అధిక శాతం సీట్లు కేటాయిస్తే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కష్టం ఒకడిది పెత్తనం ఇంకొకడిది అన్నట్లు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పరిపాలిస్తున్నాయి. బీసీ బిడ్డల ఇళ్లల్లోకి చొరబడి చూడండి బిసి బిడ్డల అష్ట కష్టాలేంటో మీ కళ్లారా చూడవచ్చు. ఇకపై బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదని అన్నారు. ఓట్ల కోసం అయితే బీసీ ప్రజలు ఉన్నారు కానీ అర్హత ఉన్న పరిపాలన కోసం బీసీ నాయకులు లేరు. మా నాయకత్వం మాకు కావాలి మా హక్కులు మేము సాధించుకోవాలి. మా బీసీ ప్రజలకు న్యాయం జరగాలి. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ బిల్లు పెట్టి జనాభా ప్రాతిపదికను 50 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల బీసీ నాయకులు, ఆత్మ బంధువులు పాల్గొన్నారు.

# శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు





**దమ్మాయిగూడ,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** దమ్మాయిగూడ ఓల్డ్ విలేజ్ మున్సిపాలిటీ కార్యాలయం వెనుక శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ 25వ సంవత్సరం సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 25 సంవత్సరాలుగా వినాయక ఉత్సవాలను నిర్వహిస్తూ, యువతను ఏకం చేస్తూ సామాజిక,ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అసోసియేషన్ కీలకంగా పాల్గొంది. ఉత్సవాలను ప్రారంభించిన మొదటి సంవత్సరం నుండి ప్రతి ఒక సంవత్సరానికి ఒక్కొక్క ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, ఆధ్యాత్మిక,పౌరాణిక, మరియు ఒగ్గు కథల నువ్వ కూడా ప్రదర్శించేవారు. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా మరియు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా ఉత్సవాలను మెరుగుపరుస్తూ విగ్నేశ్వరుని ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండాలని అసోసియేషన్ సభ్యులు కోరుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు బాలగోని జంగులు,బాలగోని శ్రీనివాస్, బాలగోని బాలీ, బాలగోని మధు,బాలగోని నవీన్, బాలగోని ప్రవీణ్,బాలగోని శ్రీకాంత్, బూడిద సాయి,బాలగోని సాయి సాత్విక్,గుజ్జ సురేష్, గుజ్జ శివశంకర్ తదితర సభ్యులు ప్రతి సంవత్సరం కార్యక్రమాలను విజయవంతంగా చేస్తూ వస్తున్నారు. ఈ సంవత్సరం లడ్డు వేలం పాటలో అత్యధిక గరిష్టంగా 111116రూ బాలగోని శీను కైవసం చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాగే వైభవంగా విగ్నేశ్వరుని ఆశీర్వాదలతో ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు.

# గణనాధుడుని దర్శించుకున్న రాష్ట్ర ఐడిసి డైరెక్టర్ అంకెం దంపతులు



**మైలవరం,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణం హాజీపేట లో శ్రీ కార్యసిధి అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం నందు స్థానిక యువత ఆధ్యర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని, టి ఆర్ నగర్ లో సిద్ధి వినాయక యూత్ ఏర్పాటు చేసిన వినాయకుని మండపాలను జి.కొండూరు మండల తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జీ అంకెం సురేష్, రాష్ట్ర ఇరిగేషన్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అంకెం ఇందిరా ప్రియదర్శిని దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆయా కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు అంకెం దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గణనాధుని విగ్రహా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించగా కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక యువత మరియు భక్తులు పాల్గొన్నారు.

# ఏలూరు జడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ వెట్రీ సెల్వి



**ఏలూరు,సెప్టెంబర్ 25 (వార్తాప్రభ) :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా శుక్రవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఇన్చార్జి సీఈవో మరియు జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కి పూలమొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188